
www.akshratimes.com

తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 71 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com ఆదివారం 28 - 06 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



తెలంగాణలో తొలిసారిగా.. అరుదైన సదరన్ బర్డ్‌వింగ్ అతిపెద్ద సీతాకోకచిలుక



## పరామర్శించేందుకు వెళ్లారా లేక రౌడీయిజం చేసేందుకు వెళ్లారా

- ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత
- వైసీపీ నేతలను అడ్డుకున్న అమరావతి రైతులు
- అమరావతిలో అడుగుపెట్టే అర్హత వైసీపీ నేతలకు లేదన్న అనిత
- వైసీపీ నేతలను అడ్డుకున్నది భూములిచ్చిన రైతులేనని వెల్లడి

**అమరావతి :**

ఉండవల్లిలో వైసీపీ నేతల (పేర్ని నాని, అంబటి రాంబాబు, దేవినేని అవినాశ్) పర్యటన సందర్భంగా జరిగిన రాళ్లదాడిపై ఏపీ హోంమంత్రి వంగలపూడి - మిగతా 2 లో

## వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదే

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- వెలిగొండ రైతులు రాష్ట్రానికి ఆదర్శం
- వెలిగొండకు నేనే శంకుస్థాపన చేశా, పూర్తిచేసే బాధ్యత కూడా నాకే వచ్చింది
- మార్కాపురం జిల్లాలో చంద్రబాబు పర్యటన
- 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమం ప్రారంభం
- వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు, లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం



**అమరావతి :**

తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని, ఇప్పుడు దానిని పూర్తి చేసి జాతికి అంకితం చేసే బాధ్యత కూడా తనపైనే ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే గత పాలకులు కేవలం ప్రారంభోత్సవం చేసి చేతులు దులుపుకొన్నారని ఆయన విమర్శించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని కృష్ణంశెట్టి పల్లె (కె.ఎస్ పల్లె)లో శనివారం జరిగిన 'సంజీవని' కార్యక్రమ ప్రారంభోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెలిగొండ ప్రాజెక్టు అనేది మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి వంటిదని, దానిని పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.ప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.3,900 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు వివరించారు. పునరావాసం కింద నిర్వాసితులకు ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేశామని, త్వరలోనే మరో రూ.600 కోట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు, ఆ తర్వాత మిగిలిన ప్రాంతానికి పరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామని తెలిపారు. కొందరు గొడ్డలి పార్టీకి పరోక్షంగా పనిచేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని - మిగతా 2 లో

## పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికే పదవులు




- ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో పవన్ కల్యాణ్
- అన్ని కులాలను కలుపుకుని వెళ్తేనే మనుగడ సాధించగలమని కార్యకర్తలకు సూచన

**అమరావతి :**

పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికి మరిన్ని పదవులు దక్కుతాయని పవన్ స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను గుర్తించి వారి ఎదుగుదలకు సహాయం చేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలో నిర్వహించిన జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశానికి హాజరైన జనసేన అధినేత, ఉప - మిగతా 2 లో




## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

- కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా
- గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన కేంద్రమంత్రి
- రాబోయే రెండేళ్లలో దేశంలోని 500కు పైగా నగరాలకు సేవలు విస్తరించనున్నట్లు ప్రకటన
- ఈ జులై 31 లోపు ఏడు ప్రధాన నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడి

**ఢిల్లీ :**

రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సేవలను అందు బాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నేడు గుజ రాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు.గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ-వీలర్లు,ఆటో-రిక్షాలు, - మిగతా 2 లో

## 194 ఏళ్ల 'జోనాథన్' తాబేలును కలిసిన ప్రధాని మోదీ

- సెషెల్స్ పర్యటనలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధ తాబేలుతో ప్రధాని మోదీ భేటీ
- 194 ఏళ్ల 'జొనాథన్' నివసిస్తున్న బొటానికల్ గార్డెన్స్‌కు సందర్శన
- పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా మొక్కను నాటిన ప్రధాని
- భారత్-సెషెల్స్ దౌత్య సంబంధాలకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన



**ఢిల్లీ :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సెషెల్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అతిథిని కలిశారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయసు భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లోకెక్కిన 'జోనాథన్' అనే తాబేలుతో ఆయన - మిగతా 2 లో

## తెలంగాణకు చల్లని కబురు.. వారం రోజుల పాటు విస్తారంగా వర్షాలు!

- రానున్న ఏడు రోజుల పాటు తెలంగాణలో భారీ వర్షాలు
- రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- ఉత్తర, తూర్పు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- హైదరాబాద్‌లో రాత్రికి భారీ వర్షం పడే సూచనలు



**హైదరాబాద్ :**

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి చాలా రోజులు గడుస్తున్నా వర్షాలు లేక తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు - మిగతా 2 లో

## సౌదీ ప్రయాణికులకు బంగారంపై కొత్త నిబంధనలు

- సౌదీ అరేబియాకు వెళ్లే ప్రయాణికులకు బంగారంపై కొత్త నిబంధనలు
- విలువైన వస్తువుల డిక్లరేషన్ పరిమితి 60,000 నుంచి 40,000 రియాల్స్‌కు తగ్గింపు
- సుమారు రూ.10 లక్షల విలువైన బంగారం, నగలపై వివరాలు వెల్లడించాల్సిందే
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, వస్తువుల జప్తు
- మనీ లాండరింగ్ నిరోధానికి చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం



2 లో

## బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ

- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు
- బీజేపీ విజయానికి హైదరాబాద్ నుంచే నాంది పలుకుతామన్న రాంచందర్ రావు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి వచ్చినా బీజేపీని ఓడించలేవని ధీమా
- బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణ వైపు చూస్తోందన్న లక్ష్మణ్



**హైదరాబాద్ :**

పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ కంచు కోటను బద్దలు కొట్టి అధికారంలోకి రావడంతో దేశ వ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో సైతం ఫుల్ జోష్ నెలకొంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... తెలంగాణలో - మిగతా 2 లో

## ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయి

- మాజీ మంత్రి హరీష్ రావు
- చంద్రబాబు, రేవంత్, డీకే శివకుమార్ భేటీపై హరీష్ స్పందన
- తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే చారిత్రక ఒప్పందం అని రేవంత్ అంటున్నారని విమర్శ
- శిష్యుడు సీఎం అయ్యాడని చంద్రబాబు గుంద్రేవులను తీసుకొస్తున్నారని ఆరోపణ

2 లో



## ముందుకు 3 అడుగులు చుట్టూ 1 అడుగే

- ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై పరిమితులు
- ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు
- నిర్మాణ వ్యయం పెరగకుండా అదుపు చేసేందుకే ఈ నిర్ణయం
- ఇళ్ల స్లాబు 500 నుంచి 750 చదరపు అడుగులు మాత్రమే ఉండాలని జీవో
- ముందువైపు మూడు అడుగులు, మిగతా వైపులా ఒక అడుగు
- లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని గుర్తించిన గృహ నిర్మాణ సంస్థ
- ఉత్తర్వులు జారీ చేసిన గృహనిర్మాణ శాఖ కార్యదర్శి




**హైదరాబాద్ :**

ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ విస్తీర్ణంపై ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇందిరమ్మ ఇళ్ల స్లాబు 750 చదరపు అడుగులకు మించరాదని గృహ నిర్మాణ శాఖ స్పష్టం చేసింది. ముందు వైపు 3 అడుగులు, మిగతా వైపు ఒక అడుగు మాత్రమే ముందుకు రావాలని తెలిపింది. ఇంట్లోకి ఎండ, వర్షం రాకుండా అవసరమైతే సజ్జలు నిర్మించుకోవాలని సూచించింది. స్లాబ్ ఎక్కువ వేసి ఖర్చు పెరగడంతో లబ్ధిదారులు అనవసర అప్పులు చేస్తున్నట్లు గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు గృహ నిర్మాణ శాఖ వెల్లడించింది. కొత్త వాటితో పాటు ప్రస్తుతం రూఫ్ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది.ఇందిరమ్మ ఇళ్ల స్లాబు ఇక నుంచి ఇష్టం వచ్చిన సైజులో - మిగతా 2 లో

# సంపాదకీయం

## లక్నో విషాదం...!



మూడువారాల్లో జరిగిన రెండు ఘోర అగ్నిప్రమాదాలు దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఢిల్లీ తరువాత ఇప్పుడు లక్నో వంతు. ఎన్నో ఆశలతో మంచి భవిష్యత్తు కోసం వచ్చిన పదిహేను మంది విద్యార్థుల ప్రాణాలు ఈ ప్రమాదంలో పోయాయి. సదరు యానిమేషన్ కోచింగ్ సెంటర్ తగలబడిపోవడానికి కారణాలు ఏమైనా ఉండవచ్చును కానీ, ప్రమాదతీవ్రతకు దారితీసిన పరిస్థితులు మాత్రం ఎప్పటిలాగానే అవే. మృతుల్లో అత్యధికులు దట్టమైన పొగలో ఉక్కిరిబిక్కిరవుతూ ఊపిరాడక కన్నుమూశారు. భద్రతకు సంబంధించి ఏ జాగ్రత్తలూ తీసుకోకుండా ఒక నివాసగృహాన్ని కమర్షియల్ కాంప్లెక్స్‌గా వాడటం ఈ దారుణానికి కారణం.అధికారుల నిర్లక్ష్యం, అవినీతి ఇటువంటి ప్రమాదాలకు దోహదం చేస్తాయి. నివాస భవనంగా అనుమతి పొంది, ఆ తరువాత కాలంలో ఆస్తి చేతులు మారాక అందులో వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు మొదలైనాయి. మరోపక్క నాలుగేళ్ళ క్రితం నుంచి లక్నో మునిసిపాలిటీ ఈ భవనం నుండి కమర్షియల్ ప్రాపర్టీ టాక్స్ వసూలు చేస్తున్నదట. అయితే తదనుగుణంగా ఆ భవన నిర్మాణంలో జరగాల్సిన మార్పుచేర్పుల ఊసుమాత్రం సదరు అధికారులకు పట్టలేదు. ఆఫీసులు, ప్రధానంగా పెద్దసంఖ్యలో విద్యార్థులకు శిక్షణనిచ్చే ఈ కోచింగ్‌సెంటర్ వంటివి ఉన్నప్పటికీ, మున్సిపల్ అధికారులకు దాని లోపాలు పట్టలేదు. ఒక ఇరుకుమార్గం గుండా రాకపోకలు సాగుతూ, ఫైర్‌సేఫ్టీ అనుమతులు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ వంటి ఏర్పాట్లకు తావులేని ఈ మూడంతస్థుల భవనం మృత్యునిలయంగా పరిణమించింది. భవనంపైకి పరిగెత్తేందుకు వీల్లేకుండా ఆ దారిని సైతం మూసివేశారు.ఈ ప్రమాదం మనలను తీవ్రంగా హెచ్చరిస్తున్న మరో అంశం ఎలక్ట్రానిక్ లాకింగ్ సిస్టమ్. బయోమెట్రిక్ లాక్ అనో, స్మార్ట్‌లాక్ అనో పిలుచుకొనే ఈ వ్యవస్థ అగ్నిప్రమాదం జరగ్గానే ఆ భవనాలను మరింత ప్రమాదకరంగా మార్చివేసి, మృతుల సంఖ్య అత్యధికంగా ఉండటానికి కారణమవుతున్నది. మండుతున్న భవనాల్లో ఈ ఎలక్ట్రానిక్ డోర్ లాక్‌లు సులువుగా జామ్ అయిపోవడంతో, లోపల చిక్కుబడిపోయి మరణిస్తున్నవారి సంఖ్య అధికంగా ఉంటోంది. ఈ సాంకేతికత కారణంగా కన్నుమూసిన వారి సంఖ్య దేశంలో ఈ ఆర్నెల్లలోనే డజన్లకొద్దీ ఉన్నందున ఈ అంశంపై లోతైన అధ్యయనం జరిపి, వాటి వినియోగాన్ని ప్రమాదరహితంగా మార్చుకోవాలి. అత్యధిక వేడిమికి తాళాలు జామ్ అయిపోయి తీవ్రతను పెంచుతున్న పరిస్థితుల్లో, ఆ సంక్లిష్టతను దాటగల మెకానిజం అందులో ఉండాలి. వేడి పెరిగి, సదరు ఎలక్ట్రానిక్ లాక్ విఫలం కాగానే అది జామ్ కావడానికి బదులు తెరుచుకోగలిగితే ఎంతో ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. ఎలక్ట్రానిక్ లాక్‌ల ఖరీదు క్రమంగా తగ్గిపోతూండటంతో ఇప్పుడు అనేక చోట్ల వాటిని విరివిగా వాడుతున్నారు. అందువల్ల, కొత్త టెక్నాలజీ ప్రమాదకారిగా పరిణమించకుండా, కష్టకాలంలో కాపాడేదిగా మనం దానిని మార్చుకోవాలి. ఒక మండుతున్న భవనంలో కేవలం ఈ తరహా వ్యవస్థ కారణంగా ఏ వ్యక్తీ కూడా భవిష్యత్తులో కన్నుమూయకుండా జాగ్రత్తపడాలి. ఈ కోచింగ్ సెంటర్ ప్రవేశమార్గంలో ఏర్పాటైన బయోమెట్రిక్ విధానమే పెద్దసంఖ్యలో విద్యార్థుల మరణానికి కారణమైన మాట వాస్తవం.తప్పించుకొనే దారిలేక పలువురు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఫోన్లు చేసి కాపాడమంటూ అర్థించారట. స్థానికులు వీడియోలు తీయడంమీద పెట్టిన శ్రద్ధ, ఆర్తనాదాలు చేస్తున్న ఆ పిల్లలను కాపాడటంమీద పెట్టివుంటే ఎంతోమంది బతికిబయటపడివుండేవారని మరికొందరు వాపోయారు. ఇరవై అగ్నిమాపకయంత్రాలు, సహాయక బృందాలు సాధ్యమైనంత వెంటనే రంగంలోకి దిగి కూడా, ఇరుకైన మెట్లదారి వినా మరోమార్గం లేకపోవడంతో చాలామందిని కాపాడలేకపోయాయి. ఢిల్లీ మాలవీయనగర్‌లో ఇటీవల ఒక హోటల్ తగలబడిపోయి, ఇదే తరహాలో ప్రాణాలు పోయాయి. వ్యవస్థలన్నీ శ్రద్ధపెడితే కచ్చితంగా నివారించగల విషాదఘటనలు ఇవి. చదువులు, ఉద్యోగాలకోసం నగరాలకు తరలివస్తున్నవారి సంఖ్య పెరుగుతున్నకొద్దీ భవన యజమానుల డబ్బుయావ హెచ్చుతోంది, మనిషి ప్రాణానికి విలువలేకుండా పోతోంది. లక్నో ఘటన దేశానికి మరో హెచ్చరిక. వివిధ విభాగాలన్నింటి సమన్వయంతో, సమాచార మార్పిడితో, తనిఖీలు నిఘాలు పెంచి, లోపాయికారీ వ్యవహారాలకు తావులేని రీతిలో వ్యవహరించి ఇటువంటి విషాదాలు పునరావృతం కాకుండా చూడాలి.

# వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదే



మొదటిపేజీ తరువాయి - నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

**ఆగస్టు 15 నుంచి 'సంజీవని'**

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రూపొందించిన 'సంజీవని' కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇది ఒక సమగ్ర డిజిటల్ ఆరోగ్య వేదిక అని, దీని ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ సేవల వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను అనుసంధానం చేస్తామని వివరించారు.ప్రెడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాలతో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తామని, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులను భద్రపరుస్తామని తెలిపారు. ప్రజలు కూడా మంచి ఆహారం, వ్యాయామం, యోగా వంటి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**బ్లేడు, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయి!**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని, వ్యవస్థలన్నీ విధ్వంసానికి గురయ్యాయని చంద్రబాబు ఆరోపించారు. నలుగురు వ్యక్తులు స్వేచ్ఛగా మాట్లాడుకోలేని భయానక వాతావరణం ఉండేదని, బ్లేడు, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయని విమర్శించారు. నేడు ఆ పరిస్థితి మారిందని, ప్రజలు స్వేచ్ఛగా ఉన్నారని అన్నారు.

**రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పడ్డాయని స్పష్టం చేశారు.**

మహిళల కోసం స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0 వంటి పథకాలను అమలు చేస్తున్నామని, వచ్చే నెలలో 'తల్లికి వందనం' కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. రైతుల కోసం మొదటి విడత నిధులు ఇప్పటికే విడుదల చేశామని గుర్తుచేశారు.

**యువత, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి**

రామాయపట్నం పోర్టును త్వరలోనే పూర్తి చేసి, పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చి, పండ్ల తోటలు, వాణిజ్య పంటలను ప్రోత్సహించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రైతులు విచ్చలవిడిగా పురుగుమందులు వాడటం వల్ల మన ఉత్పత్తులు అంతర్జాతీయంగా తిరస్కరణకు గురవుతున్నాయని, అందుకే ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని సూచించారు. యువత ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలు నేర్చుకొని భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జనాభా తగ్గుదల వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని, ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలకు ప్రోత్సాహకాలు ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రులు డీబీవీ స్వామి, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికే పదవులు

మొదటిపేజీ తరువాయి -
ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జనసైనికులకు పలు సూచనలు చేశారు. జనసేవ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యుల ఎంపిక గురించి మాట్లాడారు.క్షేత్రస్థాయిలో పనిచేసే వారి వివరాలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత అని పవన్ అన్నారు. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారని, అది సరికాదని తెలిపారు. ఎన్నేళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకునే ఎంపిక జరిగిందన్నారు. కమిటీలో ఉన్నవారికి త్వరలోనే విధివిధానాలు అందిస్తామన్నారు.ఏ ఉద్యమమైనా కొత్త తరానికి విస్తరించాలి: క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని పవన్ దృష్టికి తేవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలని, అటువంటి కార్యకర్తలను నాయకత్వం గుర్తించకపోతే ఎలా అని పవన్ హితవు పలికారు. కార్యకర్త ఎదిగేందుకు మనమంతా సాయం చేయాలని, నిజమైన కార్యకర్తలపై ప్రేమ, అభిమానం చూపించాలన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించే వారికి గుర్తింపు ఇస్తామన్నారు.పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికి మరిన్ని పదవులు వస్తాయని స్పష్టం చేశారు. జనసేన పార్టీలో 18 వేలమంది సాధక్‌లు ఉన్నారన్నారు. ఏ ఉద్యమమైనా కొత్త తరానికి విస్తరించాలని, లేకుంటే ఎదుగుదల ఉండదని పవన్ తెలిపారు. తాను చెప్పినట్లు ముందుకెళ్తే జనసేనకు కోటిమంది సభ్యులు ఉండేవారని, పార్టీ మహావృక్షంగా ఎదిగితే ఆ కొమ్మలపై మీరు కూర్చోవచ్చని పవన్ కల్యాణ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.'కులాలతో రాజకీయాలు చేయను. చేయబోను. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు దక్కుతాయి. అన్ని కులాలను కలుపుకుని వెళ్తేనే మనుగడ సాధించగలం. నేనెప్పుడూ కులాలను రాజకీయాలకు పెట్టుబడి పెట్టను. క్షేత్రస్థాయిలో పనిచేసే వారి వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తాం. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. దేశవ్యాప్తంగా ఎస్టీ, ఎస్సీ, బీసీల పేరుతో హాస్టళ్లు ఉండకూడదు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నా. కులాలను కలపడం తప్ప విడగొట్టడం నాకు రాదు.వైఎస్సార్సీపీ నేతలు ఎప్పుడూ వ్యక్తిగతంగా దూషిస్తారని పవన్ ధ్వజమెత్తారు. 11 సీట్లు వచ్చినా వారు అలాగే మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సంక్షేమంపైనే ఆధారపడితే ఓట్లు రావని అభివృద్ధి కూడా చేయాలని సూచించారు. అందుకే వైఎస్సార్సీపీ బటన్ నొక్కినా ఓట్లు రాలేదని పవన్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు సరిగా పనిచేయకే ప్రజలు ప్రైవేటుకు వెళ్తున్నారని, అందుకే ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయాలని పదేపదే చెబుతున్నానన్నారు. కేంద్రం జల్‌జీవన్ మిషన్ నిధులిచ్చినా పనులు చేయాల్సింది రాష్ట్రాలేనని గుర్తు చేశారు.50 శాతం ఉన్న బీసీలకు ఒకరు ఇచ్చేదేంటి, కలిసి ఉంటే వాళ్లే ఇతరులకు ఇవ్వొచ్చు అని పవన్ అన్నారు. కులం అనే భావన ఎప్పుడూ ఇంటిగడప లోపలే ఆగాలని, గడప దాటాక మన సంస్కృతి, భాష, ధర్మం పాటించాలని సూచించారు. కృష్ణలంకలో చనిపోయిన రౌడీకి కులం అంటగట్టడమేంటని ప్రశ్నించారు. సాయికృష్ణ తల్లి బాధను అర్థం చేసుకోగలనన్నారు. తనను తిట్టేవాళ్లలో ఎక్కువమంది కాపు నాయకులే ఉన్నారని, ఎవరి భుజంపై తుపాకీ పెట్టి కాలుస్తున్నారో అందరూ చూస్తున్నారని వివరించారు. ఇష్టం వచ్చినట్లు తిట్టి, నేరాలు చేసి, కులం వెనుక దాక్కోవద్దని హెచ్చరించారు.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు




మొదటిపేజీ తరువాయి - ఫోర్-వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందని వివరించారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు.విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ.. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా భారత్ ట్యాక్సీ వేగంగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఈ వేదిక నుంచి నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటాం. దేశంలో సేవలు అందని ప్రదేశమంటూ ఉండదు" అని అమిత్ షా నొక్కి చెప్పారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్, పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు.భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే సుమారు ఏడు లక్షల మంది 'సారథులు' (డ్రైవర్-సభ్యులు) భారత్ ట్యాక్సీ కుటుంబంలో భాగమయ్యారు. ఈ రోజు మీరు కూడా ఈ కుటుంబంలో చేరడం చాలా సంతోషంగా ఉంది" అని గుజరాత్‌లో కొత్తగా చేరిన సభ్యులను ఉద్దేశించి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే మంత్రాన్ని సాకారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అమిత్ షా పేర్కొన్నారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# పరామర్శించేందుకు వెళ్లారా లేక రౌడీయిజం చేసేందుకు వెళ్లారా

మొదటిపేజీ తరువాయి - అనిత తీవ్రంగా స్పందించారు. అమరావతిలో అడుగుపెట్టే కనీస అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. వారు రైతులను పరామర్శించడానికి వెళ్లారా లేక రౌడీయిజం చేయడానికా అని ప్రశ్నిస్తూ... వారి వెంట ఎంతమంది రౌడీషీటర్లు ఉన్నారో పోలీసుల వద్ద పక్కా లిస్ట్ ఉందని చెప్పారు. గతంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన వారు కూడా వైసీపీ నేతల వెంట వచ్చారని... విజువల్స్ లో అందరూ ఉన్నారని తెలిపారు. వైసీపీ నేతలకు వ్యతిరేకంగా అక్కడ నిరసన తెలిపిన వారిలో 90 శాతం మంది రాజధాని కోసం భూములిచ్చిన అసలైన రైతులేనని స్పష్టం చేశారు.వైసీపీ అధినేత జగన్ గతంలో అమరావతిని అంగీకరించి, ఆ తర్వాత మూడు రాజధానుల డ్రామాలతో ఐదేళు నరకం చూపించారని మండిపడ్డారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని అమరావతి రైతుల వద్దకు వస్తున్నారని ప్రశ్నించారు. అమరావతి పూర్తయితే వైసీపీకి మనుగడ ఉండదనే ఈ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అహర్నిశలు కష్టపడుతూ 2027 నాటికి అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయడమే టార్గెట్‌గా పెట్టుకుందన్నారు.

# 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి - భేటీ అయ్యారు. సెషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ, ఈ సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించి ఈ అరుదైన జీవిని చూశారు.సుమారు 194 ఏళ్ల వయసున్న జోనాథన్, 1832లో జన్మించినట్లు అంచనా. ప్రస్తుతం వయసు రీత్యా కంటిచూపు మందగించడం, వాసన శక్తి తగ్గడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ, అది ఆరోగ్యంగానే ఉంది. ఈ అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు సెషెల్స్‌లో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణకు చిహ్నంగా బొటానికల్ గార్డెన్స్‌లో ఒక మొక్కను నాటారు.భారత్, సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నిరోధం వంటి కీలక అంశాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. దౌత్యపరమైన పర్యటనలో ఇలాంటి ఆసక్తికరమైన సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# సౌదీ ప్రయాణికులకు బంగారంపై కొత్త నిబంధనలు

మొదటిపేజీ తరువాయి - సౌదీ అరేబియాకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే ప్రయాణికుల కోసం ఆ దేశ ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. మనీలాండరింగ్ నిరోధక చర్యల్లో భాగంగా బంగారం, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు రవాణాపై నిబంధనలను మరింత కఠినతరం చేసింది. గతంలో ఉన్న 60,000 సౌదీ రియాల్స్ డిక్లరేషన్ పరిమితిని ప్రస్తుతం 40,000 రియాల్స్‌కు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది.సౌదీ అరేబియాలోని జకాత్, ట్యాక్స్ అండ్ కస్టమ్స్ అథారిటీ ఈ కొత్త నిబంధనలను అమలు చేస్తోంది. దీని ప్రకారం, ఎవరైనా 40,000 సౌదీ రియాల్స్ (సుమారు రూ. 10 లక్షలు) లేదా అంతకంటే ఎక్కువ విలువైన నగదు, బంగారం, విలువైన లోహాలు, రత్నాలు లేదా ఆభరణాలు తీసుకెళుతున్నట్లయితే కస్టమ్స్ అధికారులకు తప్పనిసరిగా రాతపూర్వక డిక్లరేషన్ సమర్పించాలి. వీటికి సంబంధించిన కొనుగోలు ఇన్‌వాయిస్‌లను కూడా అధికారులకు చూపించాల్సి ఉంటుంది.ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. సరైన వివరాలు వెల్లడించని పక్షంలో, సదరు వస్తువులను 72 గంటల పాటు తాత్కాలికంగా జప్తు చేస్తారు. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘించిన వారికి (మనీ లాండరింగ్ ఉద్దేశం లేదని నిర్ధారణ అయితే), స్వాధీనం చేసుకున్న వస్తువుల విలువలో 10 నుంచి 25 శాతం వరకు జరిమానా విధిస్తారు. ఈ ఉల్లంఘన పునరావృతమైతే జరిమానాను 50 శాతానికి పెంచే అవకాశం ఉంది. ఒకవేళ నేరపూరిత ఉద్దేశాలు ఉన్నట్లు అనుమానిస్తే, సదరు కేసును పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేస్తారు.ఈ కొత్త నిబంధనలు భారత్ సహా ఇతర గల్ఫ్ దేశాలకు ప్రయాణించే ప్రవాసులపై ప్రధానంగా ప్రభావం చూపనున్నాయి. ప్రయాణికులు తమ వెంట తీసుకెళ్లే విలువైన వస్తువులకు సంబంధించిన అసలు రశీదులను భద్రపరుచుకోవాలని మరియు ప్రయాణానికి ముందు తాజా నిబంధనలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


# తెలంగాణకు చల్లని కబురు.. వారం రోజుల పాటు విస్తారంగా వర్షాలు!

మొదటిపేజీ తరువాయి - అందించింది. రుతుపవనాలు ఆలస్యంగా పుంజుకోవడంతో రాష్ట్రంలో వర్షపాతం కొరత ఏర్పడింది. అయితే, తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రానున్న ఏడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది.వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం.. నేడు ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు. వీటితో పాటు హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా వర్ష సూచన నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. జులై 2వ తేదీ వరకు వర్షాలు కొనసాగుతాయని పేర్కొంది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే నమోదయ్యే సూచనలు ఉన్నాయని వివరించింది.ఇక, రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం లభించింది. ఈరోజు మధ్యాహ్నం తర్వాత తేలికపాటి జల్లులతో ప్రారంభమై, సాయంత్రం 6 గంటల తర్వాత వర్షం తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రి వేళ నగరంలో భారీ వర్షం కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం,ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

# ముందుకు 3 అడుగులు చుట్టూ 1 అడుగే


మొదటిపేజీ తరువాయి -
నిర్మించడానికి వీల్లేదు. స్లాబు ఎంత విస్తీర్ణం ఉండాలో ప్రభుత్వం విధివిధానాలు వెల్లడించింది. స్లాబు 700 చదరపు అడుగులకు మించరాదని స్పష్టం చేస్తూ గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు లక్ష ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కాగా, మరో లక్ష ఇళ్లు ఈ సెప్టెంబర్ నాటికి పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు రెండో విడత ఇళ్ల కేటాయింపునకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.స్థలం ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తోంది. అయితే ఖర్చు ఎక్కువవుతోందని కొందరు మధ్యలో నిర్మాణాలు ఆపడం, మరికొందరు ప్రారంభించకపోవడాన్ని గుర్తించిన హౌసింగ్ కార్పొరేషన్ వ్యయంపై అధ్యయనం చేసింది. చాలా మంది స్లాబ్ ఎక్కువ సైజులో నిర్మిస్తున్నట్లు గుర్తించింది. కొంతమంది గోడల కన్నా సుమారు 8 అడుగుల వరకు ముందుకొస్తున్నట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. పెద్ద స్లాబు నిర్మించడం వల్ల ఖర్చు పెరిగి, కొందరు లబ్ధిదారులు అప్పులు చేయాల్సి వచ్చి నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేస్తున్నట్లు గుర్తించారు. దానివల్ల పేదలు ఇళ్ల నిర్మాణం కోసం సబ్సిడీ నిధులు ఇచ్చే ప్రధాన లక్ష్యమే దెబ్బతింటోందని ప్రభుత్వం పేర్కొంది.వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని స్లాబ్ విస్తీర్ణంపై పరిమితులు విధించాలని హౌసింగ్ కార్పొరేషన్ కోరడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటి ముందు వైపు గోడల కన్నా 3 అడుగులు, మిగతా వైపు ఒక అడుగు మాత్రమే స్లాబ్ ఉండాలని జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉదాహరణకు 400 చదరపు అడుగుల ఇంటికి 500 చదరపు అడుగుల వరకు, 600 ఎస్ఎఫ్‌టీ ఇంటికి 750 చదరపు అడుగుల వరకు మాత్రమే స్లాబు ఉండాలని పరిమితి విధించింది. ఇంటిలో ఎండ, వాన రాకుండా ఉండేందుకు స్లాబు పెంచడానికి బదులుగా తలుపులు, కిటికీల పైన సజ్జలు, సన్‌షేడ్‌లు నిర్మించేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని హౌసింగ్ కార్పొరేషన్ అధికారులకు ప్రభుత్వం తెలిపింది.ఎండ రాకుండా ఆర్‌సీసీ స్లాబు పెంచే బదులుగా అవసరమైతే రేకులు వేసుకునేలా లబ్ధిదారులకు వివరించాలని పేర్కొంది. కొత్తగా నిర్మించే ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇప్పుడు బేస్‌మెంట్, రూఫ్ లెవెల్‌లో ఉన్న నిర్మాణాలకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని ప్రభుత్వం వెల్లడించింది. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించింది.

# బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ



మొదటిపేజీ తరువాయి - విజయఢంకా మోగించడమే బీజేపీ నెక్స్ట్ టార్గెట్ అని స్పష్టం చేశారు.హైదరాబాద్ నుంచే ఈ విజయానికి నాంది పలుకుతామని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించి చూపెడతామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి వచ్చినా సరే.. బీజేపీని ఓడించడం ఎవరి తరం కాదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రేపు హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. మరోవైపు వరంగల్ లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... బీజేపీ జాతీయ నాయకత్వం మొత్తం తెలంగాణ వైపే చూస్తోందని అన్నారు. ఈనెల 29న నితిన్ నబీన్ వరంగల్‌లో పర్యటిస్తారని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బూత్ లెవెల్ కార్యకర్తల సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. బీజేపీని కాదని కాంగ్రెస్ ను గెలిపించిన ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయిందని అన్నారు.

## ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయి



మొదటిపేజీ తరువాయి -కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు (చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్) జరిపిన రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో సీఎంలు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురు మాత్రమే కూర్చుని ఏం చర్చించారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్రేవుల ప్రాజెక్టులు ముందుకు వెళుతుంటే, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'చారిత్రక ఒప్పందం' అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.గతంలో గుండ్రేవులను బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని... కానీ ఇప్పుడు ఏపీ సీఎం తన 'శిష్యుడు' రేవంత్ తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును తీసుకురావడం జరుగుతోందని ఆరోపించారు. ఆర్డీఎస్‌కు స్పష్టమైన నీటి కేటాయింపులు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించిన హరీష్ రావు... రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన కూడా లేదని ఎద్దేవా చేశారు. గత 60 ఏళ్లలో కాంగ్రెస్ సగటున 4 టీఎంసీలు మాత్రమే తెచ్చుకుంటే, బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున అనుమతులు తెచ్చుకున్నామని గుర్తు చేశారు."మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నాం. ఇంకా 138 టీఎంసీలు రావాలి. రేవంత్ రెడ్డి తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావద్దు" అని వ్యాఖ్యానించారు.


# పంట కాలువల్లో పూడికతీత వెంటనే చేపట్టాలి-కౌలూరి పతిరాజు

**రైతుల రవాణా సమస్యలు పరిష్కరించాలి-రాసంశెట్టి రాజా**

**ప్రజా దర్బార్ కార్యక్రమంలో సమస్యలతో కూడిన జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం**



**ఏలేశ్వరం,జూన్27.అక్షర టైమ్స్ :** జిల్లాలో నారుమళ్లు వేసుకునే సమయం సమీపిస్తున్నా అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ పంటకాలువల్లో పూడికతీత పనులు ప్రారంభం కాలేదని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కౌలూరి పతిరాజు పేర్కొన్నారు.ఉపాధి హామీ కూలీలను వినియోగించి ఈ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆయన కోరారు. వ్యవసాయ పనుల సమయంలోనే ఉపాధి పనులు కొనసాగించడంతో రైతులకు కూలీలు అందు బాటులో లేక ఇబ్బందులు ఎదురవుతు న్నాయని,ఆ సమయంలో ఉపాధి పనులకు తాత్కాలిక విరామం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను పొలాల నుండి తరలించేందుకు రహదారి సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.అసైన్డ్ భూములు,పుంతల ప్రాంతాల్లో గ్రావెల్ రోడ్లు వేయాలని ఆయన కోరారు.అలాగే యాప్ ద్వారా ఎరువుల పంపిణీ విధానం మంచిదేనని,అయితే సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రకృతి విపత్తుల సమయంలో పంటలను కాపాడుకునేందుకు అవసరమైన పట్టాలు (బరకాలు) గ్రామ సచివాలయాల్లో ముందుగానే నిల్వ ఉంచాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నీలగిరి చిట్టిబాబు,కోశాధికారి కంపరపు నాగేశ్వరరావు,సభ్యులు కాకిలేటి వీర్రాజు,నామసాని నాగేశ్వరరావు,భేరి రాము,కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగిలిదేవి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.సమావేశం అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న 'వన్ మంత్ వన్ విలేజ్ ఫీల్డ్ విజిట్స్' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు.

www.akshratimes.com

తెలుగు దినపత్రిక

అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం


గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,

కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా


# హైదరాబాద్‌లో రేపు పల్స్ పోలియో కార్యక్రమం

**ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కలు**

**పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రుల చిన్న బాధ్యత**




దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం (జూన్ 28) ఘనంగా నిర్వహించనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నగరంలోని అన్ని పోలియో బూత్‌లలో ఉదయం నుంచే కార్యక్రమం ప్రారంభమవుతుంది.ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం తప్పనిసరి అని అధికారులు సూచిస్తున్నారు. గతంలో పోలియో వ్యాక్సిన్ తీసుకున్న పిల్లలకు కూడా ఈసారి మళ్లీ రెండు చుక్కలు వేయించాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. పిల్లల ఆరోగ్య రక్షణకు ఇది అత్యంత సురక్షితమైన, సమర్థవంతమైన టీకా అని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**పోలియో అంటే ఏమిటి**

పోలియో అనేది వైరస్ వల్ల వచ్చే తీవ్రమైన అంటువ్యాధి. ఇది ప్రధానంగా చిన్నపిల్లలపై ప్రభావం చూపుతుంది. ఈ వైరస్ నాడీ వ్యవస్థపై దాడి చేసి చేతులు, కాళ్లు శాశ్వతంగా పనిచేయకుండా (పక్షవాతం) చేయవచ్చు. కొన్ని తీవ్రమైన సందర్భాల్లో ప్రాణాపాయం కూడా ఏర్పడే అవకాశం ఉంటుంది.

**పోలియో చుక్కలు వేయించకపోతే ఏమవుతుంది**

చిన్నారికి పోలియో వైరస్ సోకే ప్రమాదం పెరుగుతుంది.
శాశ్వత పక్షవాతం వచ్చే అవకాశం ఉంటుంది.
జీవితాంతం వికలాంగత్వంతో బాధపడే పరిస్థితి ఏర్పడవచ్చు.
ఇతర పిల్లలకు కూడా వైరస్ వ్యాపించే ప్రమాదం ఉంటుంది.
ఒకసారి పక్షవాతం వచ్చిన తర్వాత పూర్తిగా నయం చేసే చికిత్స లేదు.

**తల్లిదండ్రులకు అధికారుల సూచనలు**

ఐదేళ్లలోపు పిల్లలను తప్పనిసరిగా సమీపం లోని పోలియో బూత్‌కు తీసుకెళ్లాలి.గతంలో ఎన్ని సార్లు పోలియో చుక్కలు వేసినా ఈసారి కూడా వేయించాలి.జ్వరం లేదా స్వల్ప అనారోగ్యం ఉన్నా వైద్యుల సూచన మేరకు పోలియో చుక్కలు వేయించవచ్చు.పోలియో కార్యక్రమంలో ప్రతి చిన్నారి భాగస్వామ్యం కావడం దేశ ఆరోగ్య భద్రతకు ఎంతో కీలకం.

**ప్రజలకు విజ్ఞప్తి**

"రెండు చుక్కలు... జీవితాంతం రక్షణ" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా పాల్గొని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని జీహెచ్ఎంసీ, వైద్యారోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి గోపగాని పాండు.

# పారదర్శక ఓటర్ల జాబితాయే ప్రజాస్వామ్యానికి పునాది

**ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపు**

**ఉప్పల్ డివిజన్ 402,403,404,407 బూత్ లో"సార్ " కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన (సార్ ) ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.పారదర్శక ఓటర్ల జాబితాయే ప్రజాస్వామ్యానికి పునాదిగా మారుతుందన్నారు. సర్ తో నిజమైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకోవాలి సూచించారు.ఉప్పల్ నియోజక వర్గంలో గురువారం ప్రారంభమైన సర్ ను ఈరోజు రజితపరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీ లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి బీఎల్ఓలకు, బీఎల్ఏలకు తగు సూచనలు చేశారు.సార్ ప్రక్రియ యొక్క ప్రాముఖ్యత రాష్ట్రంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమం అత్యంత కీలకమైనదని ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు.మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ ఆదేశాల మేరకు మనం ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి బాధ్యతతో



భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడికి ఉన్న అతిపెద్ద ఆయుధమన్నారు. పారదర్శకంగా - నిష్పక్షపాతంగా సర్ సవరణ జరిగేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉప్పల్ డివిజన్ సార్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగేలా మన బి ఎల్ ఏ లు అందరూ క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటు కూడా పోకుండా చూసుకోవాలని కోరారు. అర్హులైన, నిజమైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున కూడా ఓటర్ల జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకునేలా మన ఏజెంట్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.ఓటర్ల సవరణ లేదా నమోదు



ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సులభంగా అవగాహన కల్పించేలా మనం సహాయ పడాలన్నారు. బాధ్యతలు మన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్యంగా బూత్ లెవల్ ఏజెంట్లు ప్రతి బూత్ పరిధిలో ఇళ్లను సందర్శించి ఓట్ల వివరాలను పరిశీలించాలన్నారు.కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ సీనియర్ నాయకులు లూకాస్, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, రాములు, వేణు యాదగిరి, సుధాకర్, బి ఎల్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.

# మొహరం వేడుకల్లో మతసామరస్య సందేశం..

**పీర్ల ఊరేగింపులో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న బొంతు శ్రీదేవి**



**చర్లపల్లి,జులై27.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** చర్లపల్లి డివిజన్‌లో మొహరం పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలు, సంప్రదాయాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. మొహరం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలు, పీర్ల సామూహిక ఊరేగింపులు భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన బొంతు శ్రీదేవి పీర్ల ఊరేగింపులో భక్తులతో కలిసి పాల్గొని



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం తన మొక్కులు చెల్లించారు.ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి మాట్లాడుతూ, మొహరం పండుగ కేవలం ఒక మతానికి సంబంధించిన వేడుక మాత్రమే కాదని, పరస్పర గౌరవం, త్యాగం, మానవతా విలువలను చాటిచెప్పే పర్వదినమని పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని మతాల ప్రజలు ఒకరినొకరు గౌరవించుకుంటూ, పరస్పర సహకారంతో పండుగలను జరుపుకోవడం గంగా--జమునీ తహజీబ్‌కు ప్రతీక అని అన్నారు. ఇలాంటి వేడుకలు సమాజంలో సోదరభావం, ఐక్యత, సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.ప్రతి పండుగ సమాజాన్ని ఒక్కతాటిపైకి తీసుకువచ్చే శక్తిని కలిగి ఉంటుందని, కులమత భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పాల్గొనడం భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ప్రతిబింబిస్తుందని ఆమె అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజలు పరస్పర ప్రేమాభిమా నాలతో జీవించాలని ఆకాంక్షించారు.మొహరం వేడుకల సందర్భంగా స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు. పీర్ల ఊరేగింపులు, ప్రార్థనలు, భక్తుల సందడి మధ్య చర్లపల్లి డివిజన్‌లో ఆధ్యాత్మిక, మతసామరస్య వాతావరణం నెలకొంది. ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ మొహరం పండుగను ఘనంగా జరుపుకోవడం విశేషంగా నిలిచింది.

# యర్రవరంలో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ పునఃప్రతిష్ట మహోత్సవం

**సోమవారం ఉదయం 7:35 గంటలకు ప్రతిష్ట..**

**వేద పండితుల మంత్రోచ్ఛారణలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ..**

**ఏలేశ్వరం,జూన్27.అక్షర టైమ్స్ :** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలోని ఏలేరు నది తీరాన గల శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ పునఃప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం గ్రామపెద్దలు, ప్రజలు, వేద పండితుల సమక్షంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత శోభాయమానంగా ప్రారంభమైంది.సోమవారం ఉదయం 7 గంటల 35 నిమిషాలకు ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి.ఈ రోజు శనివారం గణపతి పూజ, యాగశాల ప్రవేశం, రక్షాబంధనం, మండపారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.రేపు ఆదివారం పునఃపూజ కార్యక్ర మం,హోమం నిర్వహిం చనున్నారు. భక్తులు ఈ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని అర్చకులు అచ్చిబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో నీరుకొండ సత్యనారా యణ, బస్వా ప్రసాద్, బీశెట్టి అప్పలరాజు, మైరాల కనకారావు, తోట హరి, కేళంగి సత్యనారాయణ, కేళంగి వీరబాబు, దాసరి రమేష్, సేనాపతి జగదీష్ తదితర ఆలయ



కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

## కత్తిపూడి హైస్కూల్‌లో ఘనంగా 'నషా ముక్త్ భారత్' కార్యక్రమం


**సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి ఆదేశాలతో కార్యక్రమం**





**ఏలేశ్వరం,జూన్27.అక్షర టైమ్స్ :** శంఖవరం మండలం కత్తిపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను వ్యసనాలకు దూరంగా ఉంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' (మాదకద్రవ్యాల రహిత భారత్) కార్యక్రమాన్ని సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి ఆదేశాలతో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అలాగే ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బివి రజని హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేటి యువత,విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని పిలుపునిచ్చారు.ధూమపానం,మద్యం,డ్రగ్స్ వంటి అలవాట్లు ఆరోగ్యానికి మాత్రమే కాకుండా కుటుంబాలకు కూడా తీవ్ర నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు.విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు.అనంతరం విద్యార్థులందరితో ఉపాధ్యాయులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని,సమాజంలో వీటి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## చెక్కా వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం,జూన్27.అక్షర టైమ్స్ :** గోకవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన టిడిపి మహిళా నాయకురాలు చెక్క మరియమ్మ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ. నవ వధీవరులు లక్ష్మీ శ్రీ పవన్ కుమార్ లకు ఎమ్మెల్యే తన ఆశీర్వాదాలు అందించారు. జగ్గంపేట నియోజవర్గ మహిళా శక్తి టీం లో మరియమ్మ సభ్యురాలు కావడంతో ప్రత్యేకించి ఎమ్మెల్యే ఈ కార్యక్రమానికి హాజరుకావడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు, జగ్గంపేట మార్కెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, నియోజవర్గ టిడిపి యువ నాయకులు సుబ్బారావు,సుమన్,కొత్తపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు దిండి రాజు, మండల దివ్యాంగుల అధ్యక్షులు అడబాల సింగారియ్య, పోతాబత్తుల శ్రీను,,దిండి వెంకటేశ్వరావు,బలస సునీల్,మహిళా శక్తి సభ్యులు గెద్దాడ సత్యవేణి,పోలినాటి ధర్మానంద కుమారి,గొల్లవిల్లి శ్రీదేవి,రాపాక లక్ష్మి,గుమ్మల్ల ఆనంత లక్ష్మీ, సుజాత,,సత్యవతి,దిండి సూరిబాబు, కొండబాబు,ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గంగానపల్లి గ్రామంలో పల్స్ పోలియో ర్యాలీ

**కాకినాడ,జూన్27.అక్షర టైమ్స్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గంలో గంగానపల్లి గ్రామంలో పల్స్ పోలియో ర్యాలీ నిర్వహించారు. శనివారం ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.గంగాభవాని, ఏ ఎన్ ఎం జె. అమిత ఆధ్వర్యంలో ర్యాలీ చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలియో నివారణ పై నినాదాలు చేసి ర్యాలీ నిర్వహించారు. నిండు జీవితానికి రెండు




చుక్కలు తదితర నినాదాలు తో గ్రామంలో పలు వీధుల్లో ర్యాలీ చేసారు. గంగానపల్లి పంచాయతీ ఆఫీసు లో ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. అప్పుడే పుట్టిన పిల్లలు నుంచి ఐదేళ్లు ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని అన్నారు.

## బీరంగూడ శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ విగ్రహ,ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో పాల్గొన్న నందారం నరసింహ గౌడ్





**బీరంగూడ,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ డివిజన్, మారుతి నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్టాపన మరియు ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నరసింహ గౌడ్ గారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భక్తులందరూ కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, భక్తులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన శాస్త్రోక్త పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## బొల్లారంలో ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**బొల్లారం,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బొల్లారం డివిజన్ వార్డు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. స్వయం సహాయక గ్రూపు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం



అందిస్తున్న ఇందిర మహిళా శక్తి చీరలను పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతిలో స్వయం సహాయక సంఘాలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలతో మరింత అభివృద్ధి చెందాలని మహిళలకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

## కుషాయిగూడలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా**





**కుషాయిగూడ,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** కుషాయిగూడలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరుకాగా, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులైన పిల్లి మాధవి, చల్లా శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. బాధితుల పరిస్థితిని గుర్తించి, నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పానగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సల్ల వెంకటేష్, సలహాదారుడు కొడకండ్ల యాదయ్య, కార్యనిర్వహణ కార్యదర్శి పందాల గణేష్ గౌడ్ తదితరులు పాల్గొని లబ్ధిదారులను అభినందించారు.

## కుషాయిగూడలో విద్యుత్ అంతరాయం

**ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత**

**కుషాయిగూడ,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** కుషాయిగూడ లోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో కుషాయిగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జూన్ 28 (ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కుషాయిగూడ ఏఈ రామకృష్ణ తెలిపారు. మొదటి విడతలో 11 కేవీ కుషాయిగూడ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అదేవిధంగా, 11 కేవీ పద్మావతి ఫీడర్ పరిధిలోని తులసి హాస్పిటల్ ఏరియా, నిర్మల లాడ్జ్ పరిసరాలు, తల్లూరి థియేటర్ ప్రాంతం, ఇండస్ట్రియల్ ఏరియా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. మరమ్మతుల పనులు పూర్తయ్యాక విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతుందని పేర్కొన్న ఏఈ రామకృష్ణ, ఈ తాత్కాలిక అసౌకర్యాన్ని ప్రజలు అర్థం చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, విద్యుత్ అంతరాయం సమయంలో అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు.

## ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ పరిశీలన

**ఈఆర్ఓ నారాయణ్ అమిత్ ఐఏఎస్**





**శేరిలింగంపల్లి,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి ఎం.ఈరన్న :** శేరిలింగంపల్లి వార్డు పరిధిలోని పోలింగ్ స్టేషన్ 96లో శనివారం జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను ఈఆర్ఓ నారాయణ్ అమిత్ ఐఏఎస్ సందర్శించారు. క్షేత్రస్థాయి ఏర్పాట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ సజావుగా, సకాలంలో పూర్తయ్యేలా అధికారులు, ఓటర్లతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియలో సమన్వయం, ఖచ్చితత్వం, సామర్థ్యం పాటించాలని సంబంధిత బృందాలను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, ప్రతి ఫారం కచ్చితంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్యుమరేషన్ ప్రక్రియ పారదర్శకంగా, ఇబ్బందులు లేకుండా కొనసాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ గణపతి ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి






**అమీన్‌పూర్,జూన్27.అక్షరటైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ డివిజన్ మారుతి నగర్‌లో శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ పూజా కార్యక్రమంలో ఆదర్శ్ రెడ్డి పాల్గొని, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆదర్శ్ రెడ్డిని ఘనంగా సన్మానించి, శాలువాతో సత్కరించి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతా రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, బాలరాజు, మాణిక్ యాదవ్ మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పటాన్‌చెరు నియోజకవర్గంలో పచ్చదనానికి పెద్దపీట

**మూడు పార్కులకు శంకుస్థాపన చేసిన గూడెం మహిపాల్ రెడ్డి**



**అమీన్పూర్,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** పార్కులు ప్రజల ఆరోగ్యానికి, భవిష్యత్ తరాల ఆనందానికి చిరునామాగా నిలుస్తాయని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీ, హెచ్ఎంటి శిల్ప లేఔట్ కాలనీ, పిఎన్ఆర్ కాలనీలలో రూ. 1.51 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పార్కుల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని తొమ్మిది డివిజన్లలోని పార్కుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. పార్కుల ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు స్వచ్ఛమైన గాలి అందుతుందని, ప్రతి పార్కులో పిల్లల కోసం ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీల విలీనంపై హైకోర్టు అడ్వకేట్ ఐలాపూర్ మాణిక్య యాదవ్ కీలక వివరణ

**సోషల్ మీడియా ప్రచారాలు నమ్మవద్దు**



**పటాన్చెరు,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ పరిసర మున్సిపాలిటీల విలీనంపై జరుగుతున్న విస్తృత చర్చలపై హైకోర్టు న్యాయవాది ఐలాపూర్ మాణిక్య యాదవ్ స్పందించారు. ఈ అంశంపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తూ, ఆయన చట్టపరమైన వాస్తవాలను వెల్లడించారు.

**చట్టబద్ధత తప్పనిసరి:**

మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేయాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుందని ఐలాపూర్ మాణిక్య యాదవ్ స్పష్టం చేశారు. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం-2019 మరియు జీహెచ్ఎంసీ చట్టం-1955లోని నిబంధనలను అనుసరించి మాత్రమే ఈ ప్రక్రియ చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

**పాలనాపరమైన పరిశీలన కీలకం:**

కేవలం వార్తల ద్వారా కాకుండా, స్థానిక సంస్థల పరిస్థితులు, ప్రజాభిప్రాయం, భౌగోళిక అంశాలు మరియు పాలనాపరమైన అవసరాలను ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విలీనంపై తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన వివరించారు. ప్రభుత్వం అధికారికంగా జారీ చేసే జీ.ఓ. మరియు గెజిట్ నోటిఫికేషన్ ద్వారానే ఈ విలీనానికి పూర్తి చట్టబద్ధత లభిస్తుందని హైకోర్టు అడ్వకేట్ ఐలాపూర్ మాణిక్య యాదవ్ తెలిపారు.

**ప్రజలకు సూచన:**

ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలను చూసి ప్రజలు గందరగోళానికి గురికావద్దని, ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే వరకు వేచి చూడాలని ఆయన కోరారు. చట్టపరమైన పరిధిని తెలుసుకోవడం ద్వారా మాత్రమే వాస్తవాలను గ్రహించగలమని ఆయన ప్రజలకు సూచించారు.

## బీరంగూడలో గణనాథుడికి పూజలు చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్లబండి రమేష్



**బీరంగూడ,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** పటాన్చెరు నియోజకవర్గం, అమీన్‌పూర్ మండలం బీరంగూడలోని మారుతి నగర్ కాలనీలో గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్లబండి రమేష్ హాజరయ్యారు. ఘనంగా గణనాథుని ప్రతిష్ఠాపన గణేష్ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్లబండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కాలనీ వాసులతో కలిసి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం కాలనీ ప్రజలందరికీ గణేష్ చతుర్థి శుభాకాంక్షలు తెలియజేస్తూ, విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**ఐక్యతకు ప్రతీక గణేష్ ఉత్సవాలు: ఎడ్లబండి రమేష్**

ఈ సందర్భంగా ఎడ్లబండి రమేష్ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలు కేవలం భక్తికి మాత్రమే కాకుండా, ప్రజల మధ్య ఐక్యతను మరియు సోదరభావాన్ని పెంపొందించడానికి వేదికలుగా నిలుస్తాయని అన్నారు. స్థానిక యువత మరియు కాలనీ వాసులు అంతా కలిసి ఎంతో క్రమశిక్షణతో, భక్తిభావంతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను పూజించడం సంతోషకరమని, పండుగను శాంతియుత వాతావరణంలో అందరూ కలిసి జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కాలనీ కమిటీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# సిగాచీ బాధితులకు పూర్తి న్యాయం చేయాలి

**జూన్ 30న హరీష్ రావు పర్యటన**





**పటాన్చెరు,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** పటాన్చెరు పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర పేలుడు ఘటనకు ఏడాది పూర్తవుతోంది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ఇంకా అందకపోవడంతో, బాధితులకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 30న మాజీ మంత్రి హరీష్ రావు పటాన్చెరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న సంస్మరణ సభ పోస్టర్‌ను పశమైలారంలో బీఆర్ఎస్ పటాన్చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత ఆవిష్కరించారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసన**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిగాచీ దుర్ఘటన జరిగి ఏడాది గడుస్తున్నా, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.1 కోటి నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే బాధితులకు చెల్లించాల్సిన పరిహారాన్ని పూర్తి చేయాలని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


**సంస్మరణ సభకు పిలుపు**

జూన్ 30న హరీష్ రావు పటాన్చెరుకు చేరుకుని, బాధిత కుటుంబాలతో కలిసి నిర్వహించే సంస్మరణ సభలో పాల్గొని వారికి సంఘీభావం తెలపనున్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి బాధిత కుటుంబాలు, కార్మికులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్వీ నాయకుడు మేరాజ్ ఖాన్, ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు మచ్చ కిషోర్ రెడ్డి, బూరిగారి నరేందర్ రెడ్డి, వడ్డెగడ్డ రాజు, గొంగోళ్ల నవీన్ రెడ్డి, పెలిమెల వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, బండ రాజు, ఐలాపూర్ మాణిక్ యాదవ్, పాశంమైలారం గ్రామ అధ్యక్షుడు చంద్రశేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్

**ఘన విజయంప్రజా షెల్టర్స్, మియాపూర్‌లో 400 మందికి పైగా ఉచిత వైద్య సేవలు**

**మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ సహకారం**








**మియాపూర్,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న :** సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ప్రజా షెల్టర్స్ కమిటీ హాల్, మియాపూర్లో మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ & చైర్మన్, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ శ్రీ యలమంచి ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ శ్రీ వి. జగదీశ్వర్ గౌడ్ మరియు వైభవ్ కృష్ణ పాల్గొన్నారు.

**నిరంతర ప్రజా సేవలో యలమంచి ఉదయ్ కిరణ్**

సామాజిక సేవ పట్ల అంకితభావంతో ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే సంకల్పంతో పనిచేస్తున్న యలమంచి ఉదయ్ కిరణ్, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ విశేష సేవలందిస్తున్నారు. తన సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందడమే కాకుండా, పలు ప్రతిష్ఠా జాతీయ అవార్డులు అందుకుని తెలంగాణకు, మియాపూర్‌కు గర్వకారణంగా నిలిచారు.

**ట్రస్ట్ ద్వారా జరుగుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు:**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, జ్యామితీ బాక్సుల పంపిణీ. వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు, ఉచిత తాగునీటి పంపిణీ, సమ్మర్ కూలింగ్ స్టేషన్ల ఏర్పాటు. వృద్ధాశ్రమాల్లో పండ్ల పంపిణీ, అనాథాశ్రమాల్లో మరియు గ్రేస్ అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు. ఉచిత మెగా మెడికల్ క్యాంపులు, వైద్య పరీక్షలు, ఉచిత కంటి పరీక్షల శిబిరాలు, మందుల పంపిణీ. వికలాంగులకు అవసరమైన సామగ్రి మరియు పేద విద్యార్థులకు విద్యా సహాయం, ఫీజు సహాయం. యువతకు క్రీడా సామగ్రి, వాలీబాల్, కేరమ్ బోర్డుల పంపిణీ. జీహెచ్ఎంసీ కార్మికులకు ఫుడ్ డ్రైవ్ నిర్వహణ. ఈ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు మియాపూర్‌కే పరిమితం కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ప్రజల ప్రశంసలు అందుకుంటూ, సామాజిక బాధ్యత, మానవతా విలువలు, ప్రజా సంక్షేమానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

**ముఖ్య అతిథి శ్రీ వి. జగదీశ్వర్ గౌడ్ ప్రశంసలు**

"ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప సేవా కార్యక్రమం. యలమంచి ఉదయ్ కిరణ్ సామాజిక సేవలో ముందుండటం అభినందనీయం. ఉదయ్ కిరణ్ తనకి అత్యంత సన్నిహితుడు, హృదయానికి దగ్గరైన వ్యక్తి. ఇలాంటి యువకులు సమాజానికి ఎంతో అవసరం. ఉదయ్ చేస్తున్న అన్ని కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయి, చాలా మంది యువతకి ఆదర్శంగా నిలుస్తున్నాయి. యువ శక్తిని ప్రోత్సహించడం మనందరికీ బాధ్యత, ఇలాంటి గొప్ప కార్యక్రమాలని చేపడుతున్న వ్యక్తికి అన్ని విధాల సహాయ సహకారాలు ఉంటాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలకు దూరమవుతున్న పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప మానవతా సేవ. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందించేందుకు ఇలాంటి మెగా మెడికల్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయి."యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత విస్తృతంగా ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు.

**కృతజ్ఞతలు తెలిపిన యలమంచి ఉదయ్ కిరణ్**

అనంతరం యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, "మియాపూర్ డివిజన్ ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే మా ప్రధాన ఈ మెగా మెడికల్ క్యాంప్ ద్వారా వందలాది మందికి అవసరమైన వైద్య సేవలు అందించగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాము. మా సేవా కార్యక్రమాలకు సహకరిస్తూ, ప్రోత్సహిస్తున్న ముఖ్య అతిథులు, వైద్యులు, వాలంటీర్లు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు మరియు ప్రతి ఒక్కరికీ మా ట్రస్ట్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు. అలాగే మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ యాజమాన్యానికి ఉచిత వైద్య సేవలు, ఉచిత రవాణా సౌకర్యం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రజా షెల్టర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శంకర్, రెడ్డమ్మ, గోపాలకృష్ణ, శ్రీను, శ్రీనివాస్, సుబ్బ రాయుడు, విజయ్, వెంకట్ మరియు రామకృష్ణ తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మెగా మెడికల్ క్యాంపులో సుమారు 400 మందికి పైగా ప్రజలు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, నిపుణులైన వైద్యుల సలహాలు, అవసరమైన మందులు మరియు ఆరోగ్య మార్గదర్శకాలను ఉచితంగా పొందారు.

**పాల్గొన్న ప్రముఖులు**

ఈ కార్యక్రమంలో వీరమల్ల వీరేంద్ర గౌడ్, నడిమింటి కృష్ణ, పట్వారీ శశిధర్, రావిపాటి వెంకటేశ్వర్లు, గోవర్ధన్, సాంబశివరావు, రాజు, రాజన్, శ్రీహరి, మూర్తి, భారత్, బాబ్జీ, సత్యనారాయణ, సత్య రెడ్డి, పద్మిని, శ్రీకాంత్, శరత్, నాని, సాంబయ్య, అశోక్, మధు, ఉదయ్, శ్రీరామ్, కార్తీక్, విజయభాస్కర్, నరేందర్ రెడ్డి, పద్మ, సాయి కృష్ణ, మోహన్ రెడ్డి, ఎంసీ రెడ్డి, కృష్ణ, షా, కేవీ రావు, శేఖర్, నవ్యశ్రీ, శ్రీనివాసులు, సత్యనారాయణ, రాజేష్, కార్తీక్, దినేష్, గిరి, సీహెచ్ సాంబయ్య, బాలమురళి, నవీన్, సాధన, తాండ్ర గౌడ్, వెంకటేష్, శివ ముదిరాజ్, ప్రవీణ్, నాగసాయి, వినోద్, వంశీ చౌదరి, వాసు కామినేని, సాయి నిఖిల్, రత్నచారి, మధు, శరత్, రాధాకృష్ణ, శివప్రసాద్, సర్దార్, కర్రి నాని, అశోక్, ఇరాన్ జగన్ రామస్వామి, కిరణ్, బండి రామకృష్ణ, సురేష్, సంజయ్, ధనరాజ్, ప్రశాంత్, సల్మాన్, ఆసిఫ్, కరీం, మణిక్, శేఖర్, ప్రసాద్, రఘు, వలభనేని నరసింహారావు, ప్రకాష్, సత్య, శేషగిరిరావు తదితర ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**"సేవే మా సంకల్పం -- ప్రజల ఆరోగ్యమే మా ప్రాధాయం."**

యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న నిరంతర సేవా కార్యక్రమాలు మియాపూర్ నుంచి తెలంగాణ వ్యాప్తంగా శాశ్వత సామాజిక ప్రభావాన్ని సృష్టిస్తూ, సమాజ సేవ, మానవతా విలువలు మరియు ప్రజా సంక్షేమానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి ట్రస్ట్ తన సేవలను కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## అమీన్‌పూర్‌లో పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి





**అమీన్‌పూర్,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని మూడు పార్కుల అభివృద్ధి పనులకు పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరియు అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు. కోటి 51 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఈ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, పార్కులు ప్రజల ఆరోగ్యానికి, భవిష్యత్తు తరాల ఆనందానికి చిరునామాగా నిలుస్తాయని పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో గల ప్రతి పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. పార్కుల అభివృద్ధి ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు, కాలనీలలో పచ్చదనం పెరిగి స్వచ్ఛమైన గాలి లభిస్తుందని వివరించారు. ప్రతి పార్కులోనూ పిల్లల కోసం ఆట వస్తువులతో పాటు వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీ, హెచ్ఎంటి శిల్ప లేఔట్ కాలనీ, పీఎన్ఆర్ కాలనీలలో ఈ శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ సురేష్, డీఈ వెంకటరమణ, పార్కుల విభాగం మేనేజర్ సతీష్, మాజీ కౌన్సిలర్లు ఉపేందర్ రెడ్డి, గోపాల్, జగదీష్, కృష్ణ, మహదేవ రెడ్డి, రాములు, బిజిలి రాజు, సీనియర్ నాయకులు కొల్లూరి యాదగిరి, కాట సునీత, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జాహెద్ నగర్ కాలనీ ప్రధాన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి

**ప్రజలకు అండగా నిలిచిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)**





**ఉప్పల్,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** ఉప్పల్ నియోజకవర్గంలోని బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని జాహెద్ నగర్ కాలనీ లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) స్థానిక నివాసితులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, దాదాపు ఒక సంవత్సరం క్రితం పైప్‌లైన్ పనుల కోసం కాలనీ ప్రధాన రోడ్డును పూర్తిగా తవ్వినప్పటికీ, ఇప్పటివరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కాలనీలోని ప్రజలు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కాలనీ ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనాల రాకపోకలు కష్టతరంగా మారాయని, ప్రతి రోజు దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరి చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోయారు. వర్షాలు కురిసిన సమయంలో రోడ్డంతా బురద, నీటితో నిండిపోయి గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.స్థానికుల సమస్యలను విన్న ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) మాట్లాడుతూ, ఈ సమస్యను వెంటనే ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ మందముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత ప్రభుత్వ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి కాలనీ ప్రధాన రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రాధాన్యత. కాలనీల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ ప్రజలతో కలిసి పనిచేస్తాను. జాహెద్ నగర్ కాలనీ ప్రధాన రహదారి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా నిరంతరం అధికారులతో ఫాలోఅప్ చేస్తాను అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు షేక్ నజీర్, మీనేశ్వర్ రావు, సమర సింహా రెడ్డి, వినోద్ కుమార్, సమద్, వహీద్, జేపీఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొని కాలనీ సమస్యలను వివరించారు.

## 10వ మొహర్రం సందర్భంగా ఏక్-మినార్ మసీదులో ఘనంగా ఇఫ్తార్ విందు

**హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)**





**ఉప్పల్,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** 10వ మొహర్రం సందర్భంగా ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సమీపంలోని ఏక్-మినార్ మసీదు లో మసీదు కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఇఫ్తార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపవాసదారులు, మసీదుకు విచ్చేసిన ముస్లిం సోదరుల కోసం ఆతిథ్యపూర్వకంగా ప్రత్యేక విందు (డిన్నర్)ను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) హాజరై మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు, యువకులను ఆప్యాయంగా కలుసుకొని 10వ మొహర్రం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం మరియు ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ, మొహర్రం త్యాగానికి, ధర్మానికి, మానవతా విలువలకు ప్రతీక అని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ప్రేమ, ఐక్యత, సహోదర భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మసీదు కమిటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ అలీ, ఉపాధ్యక్షులు మక్దూమ్ గౌసియన్, కోశాధికారి నసీర్, షేక్ ఫరూక్, బాబా భాయ్, రఫీక్, మొహ్సిన్, ఫాసీ, సమద్, షేక్ నజీర్, అతౌల్లా, షకీల్ తదితర కమిటీ సభ్యులు, స్థానిక ముస్లిం పెద్దలు, యువకులు మరియు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పారదర్శక ఓటర్ల జాబితాయే ప్రజాస్వామ్యానికి పునాది

**ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపు**

**చిలకనగర్400 బూత్ లో"సర్" కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీఆర్**





**ఉప్పల్,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన (సార్ ) ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.పారదర్శక ఓటర్ల జాబితాయే ప్రజాస్వామ్యానికి పునాదిగా మారుతుందన్నారు. సర్ తో నిజమైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకోవాలి సూచించారు.ఉప్పల్ నియోజకవర్గంలో గురువారం ప్రారంభమైన సర్ ను పరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ డివిజన్ పరిధిలోని చిలకనగర్ లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి బీఎల్ఓలకు, బీఎల్ఏలకు తగు సూచనలు చేశారు.సార్ ప్రక్రియ యొక్క ప్రాముఖ్యత రాష్ట్రంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమం అత్యంత కీలకమైనదని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి అన్నారు.మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , టీపీసీసీ ఆదేశాల మేరకు మనం ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి బాధ్యతతో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడికి ఉన్న అతిపెద్ద ఆయుధమన్నారు. పారదర్శకంగా - నిష్పక్షపాతంగా సర్ సవరణ జరిగేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగేలా మన బి ఎల్ ఏ లు అందరూ క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు.ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలని కోరారు. అర్హులైన, నిజమైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున కూడా ఓటర్ల జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకునేలా మన ఏజెంట్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.ఓటర్ల సవరణ లేదా నమోదు ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సులభంగా అవగాహన కల్పించేలా మనం సహాయపడాలన్నారు. బాధ్యతలు మన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్యంగా బూత్ లెవల్ ఏజెంట్లు ప్రతి బూత్ పరిధిలో ఇళ్లను సందర్శించి ఓట్ల వివరాలను పరిశీలించాలన్నారు.కార్యక్రమంలో చిలకనగర్ డివిజన్ అధ్యక్షులు రాజేష్ ముదిరాజ్,బి ఎల్ ఏ మంచాల రఘు ,మహేందర్ ముదిరాజ్,కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రహదారులకు కొత్త రూపు - రూ.13,006 కోట్ల మహా ప్రణాళికకు శ్రీకారం



**హైదరాబాద్,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** తెలంగాణలో మౌలిక సదుపాయాల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా హైబ్రిడ్ యాన్యుటీ విధానం (హ్యామ్) కింద చేపట్టనున్న భారీ రహదారి అభివృద్ధి పనులకు జూన్ 28న నల్గొండ జిల్లా కనగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంతో రాష్ట్ర రహదారి వ్యవస్థను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది.ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని 441 రహదారులను మొత్తం 6,092 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనుండగా, ఇందుకోసం రూ.13,006 కోట్ల భారీ నిధులు వెచ్చించనున్నారు. రహదారులను నాణ్యమైన ప్రమాణాలతో విస్తరించి, ప్రయాణికులకు వేగవంతమైన, సురక్షితమైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉంది.ఈ రహదారి ప్రాజెక్టు అమలుతో గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం ఏర్పడి, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు త్వరగా తరలించే అవకాశం కలుగుతుంది. అలాగే పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలు, పర్యాటక రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడనుంది. అత్యవసర సేవలు, విద్య, వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ కానున్నాయి.తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా వైస్ ప్రెసిడెంట్ చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి మౌలిక సదుపాయాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. నాణ్యమైన రహదారులు నిర్మించడం ద్వారా ప్రజల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, ఆర్థిక కార్యకలాపాలు వేగవంతమై తెలంగాణ సమగ్ర అభివృద్ధికి ఈ ప్రాజెక్టు బాటలు వేస్తుందని ఆమె అన్నారు.ఈ ప్రతిష్టాత్మక రహదారి నిర్మాణ కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధి చరిత్రలో మరో కీలక ఘట్టంగా నిలవనుందని, తెలంగాణను మరింత ప్రగతి పథంలో నడిపించే మౌలిక వసతుల విప్లవానికి ఇది నాంది పలుకుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

## పాల సంఘం పగ్గాలు బాలకృష్ణకు.. ఏకగ్రీవంగా ఎన్నిక



**వలిగొండ,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం:సుంకిశాల గ్రామ పాల సంఘం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం చైర్మన్‌గా పోలేపల్లి బాలకృష్ణ, డైరెక్టర్‌గా తొడగల జగన్మోహన్ రెడ్డి, కార్యదర్శిగా పోలేపల్లి శీను, వేముల మైసమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పాల సంఘం అభివృద్ధితో పాటు గ్రామ పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎన్నికైన ప్రతినిధులు సభ్యుల విశ్వాసానికి అనుగుణంగా పారదర్శకంగా పనిచేస్తూ సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివయ్య గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు పోలేపల్లి వీరస్వామి, బూత్ బి.ఎల్.ఏ కమిటీ అధ్యక్షుడు ఇంజమూరి రమేష్, వరికాంతపు రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మొగిలిపాక నరసింహ, పోలేపల్లి అశోక్, తుమ్మల సత్యనారాయణ రెడ్డి, ఈతాప మల్లేష్, రాచమల్ల శంకరయ్య, పరమేష్, జంగయ్య, జంగారెడ్డి, పోలేపల్లి స్వామి, రాచమల్ల స్వామి, పోలేపల్లి నరసింహ, మల్లేష్ గౌడ్, నరేష్, ఎల్లస్వామి, ఈతాప సత్తయ్య, కొమ్మగాని రవి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## పసుపుమయమైన కృష్ణంశెట్టి పల్లె గ్రామం



**గిద్దలూరు,జూన్27.అక్షర టైమ్స్ :** గిద్దలూరు నియోజకవర్గంలోని కృష్ణంశెట్టి పల్లె గ్రామం పసుపు జెండాలు, పార్టీ శ్రేణులు, ప్రజల సందడితో కళకళలాడింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామంలో నిర్వహించిన సంజీవని వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పిలుపు మేరకు భారీ సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. గ్రామమంతా పసుపుమయంగా మారి సభా ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణంతో నిండిపోయింది.

## శ్రీ కంఠ మహేశ్వర స్వామి కల్యాణోత్సవంలో సర్వోత్తమ్ రెడ్డి ప్రత్యేక పూజలు



**పెన్‌పహాడ్,జూన్27.అక్షర టైమ్స్ :** మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ సూరమాంబ దేవి సమేత శ్రీ కంఠ మహేశ్వర స్వామి, వనం ఎల్లమ్మ -- వనం మైసమ్మ దేవతల ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల సురేష్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధితో పాటు గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.అనంతరం, భక్తుల సౌకర్యార్థం రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సహకరించిన సర్వోత్తమ్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గద్దల నాగరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు సద్దాల నగేష్ గౌడ్, మల్లేపల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ కొండేటి రాంబాబు,బొబ్బిలి నవీన్, చెన్ను వెంకట్ రెడ్డి, గద్దల కిరణ్, చింతల రమేష్, వార్డు మెంబర్ వలపట్ల రాణి శంకర్, తండు సైదులు, సిగ నాగరాజు, సద్దల సైదులు, దొంగరి జోగయ్య, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దోసపహాడ్‌లో ఘనంగా అన్నప్రసాద వితరణ

**భక్తులతో పోటెత్తిన ఆలయ ప్రాంగణం**



**పెన్ పహాడ్,జూన్27.అక్షర టైమ్స్ :** మండలంలోని దోసపహాడ్ గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ సురమాంబదేవి సమేత శ్రీ కంఠమహేశ్వర స్వామి, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మ దేవతల ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్నదాన (అన్నప్రసాద వితరణ) కార్యక్రమం శనివారం అత్యంత ఘనంగా జరిగింది. స్థలదాత సద్దల యాదగిరి వారి భార్య సద్దల సుశీల,కుమారుడు సద్దల వంశి స్థలాన్ని విరాళంగా అందించారు. దేవతా మూర్తుల దర్శనార్థం చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం పోటెత్తింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వలపట్ల సైదమ్మ లింగయ్య మాట్లాడుతూ.. గ్రామంలో ఇలాంటి మహత్కర ఆధ్యాత్మిక వేడుక జరగడం, వేలాది మంది భక్తులు తరలిరావడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అత్యంత భక్తిశ్రద్ధలతో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన దాతలు వరికుప్పల శ్రీనివాస్ - నాగమణి దంపతులను, వారి కుమారుడు మధుబాబు, కుమార్తె ఝాన్సీలను సర్పంచ్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామంలో ఆధ్యాత్మిక చింతన పెంచేలా ప్రతి ఒక్కరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దాతల ఉదారత్వాన్ని, సేవా గుణాన్ని గ్రామీణులు మరియు భక్తులు ప్రత్యేకంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు దొంగరి యుగంధర్, ఉపసర్పంచ్ వరికుప్పల రాము, దేవాలయ కమిటీ చైర్మన్ సద్దాల వంశి,గ్రామ శాఖ అధ్యక్షులు ఎల్లంల జగన్, పందిరి నాగయ్య, తక్కెలపల్లి ప్రణయ్ ఆర్ఎంపి, వార్డ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసిసి సెక్రెటరీ డాక్టర్ ఆర్తి కృష్ణను కలిసిన మంత్రులు, టీపీసిసి అధ్యక్షుడు



**శేర్లింగంపల్లి,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న :** హైదరాబాద్ విచ్చేసిన ఏఐసిసి సెక్రెటరీ డాక్టర్ ఆర్తి కృష్ణను శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో పలువురు రాష్ట్ర ముఖ్య నాయకులు, మంత్రులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

**ప్రధాన ముఖ్యాంశాలు & భేటీ విశేషాలు :** ఘన స్వాగతం: హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఏఐసిసి సెక్రెటరీ డాక్టర్ ఆర్తి కృష్ణకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, టీపీసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన స్వాగతం పలికారు.ఉమ్మడి చర్చలు: ఈ సందర్భంగా మంత్రులు, పార్టీ అధ్యక్షుడితో కలిసి డాక్టర్ ఆర్తి కృష్ణ రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై సుదీర్ఘంగా చర్చించారు.సమన్వయ ప్రాధాన్యత: అటు పార్టీ పరంగా, ఇటు ప్రభుత్వ పరంగా ప్రజల్లోకి మరింత బలంగా దూసుకువెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ భేటీలో ముచ్చటించారు. ఏఐసిసి ఆదేశాల మేరకు రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి చేయాల్సిన కృషిని వివరించారు.హాజరైన ప్రముఖులు: ఈ ఉన్నత స్థాయి సమావేశంలో మంత్రులతో పాటు పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా పాల్గొని డాక్టర్ ఆర్తి కృష్ణతో ప్రత్యేకంగా మాట్లాడారు.ఈ భేటీ రాష్ట్ర రాజకీయాల్లో మరియు కాంగ్రెస్ శ్రేణుల్లో ఒక కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు.

## గంగారంలో పోచమ్మ తల్లి అమ్మవారి వార్షికోత్సవం పూజల్లో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్





**శేరిలింగంపల్లి,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి ఎం.ఈరన్న :** చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిభావంతో నిర్వహించిన ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు జగదీశ్వర్ గౌడ్ ను ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రతి అడుగులోనూ కాంగ్రెస్ పార్టీ ముందుంటుంది





**ఉప్పల్,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి ఆధేషాలు నిర్వహించిన స్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్షవ్ రెవిషన్ ) కార్యక్రమంలో మేడ్చల్ --మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ , మాజీ కార్పరేటర్ స్వర్ణ రాజ్ శివమణి ,కాప్రా డివిజన్ అధ్యక్షుడు కొబ్బనూరి నాగశేషు, ఏఎంసి డైరెక్టర్ పూర్ణ యాదవ్, రాకేష్ యాదవ్, పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించగా, ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ అధికారి కుమార్ కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారు.ప్రతి ఓటు విలువైనది... బలమైన ప్రజాస్వామ్యానికి ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరం.

## లక్ష్మీనారాయణ కాలనీ లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ఉప్పల్ డివిజన్ లోని లక్ష్మీనారాయణ కాలనీ లో 90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు**





**ఉప్పల్,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** ఉప్పల్ మున్సిపల్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీ పనుల గురించి మాట్లాడిన కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి దృష్టికి ఇటీవల కాలనీలవాసులు రోడ్డు సమస్యలను తెచ్చారు. దీనిపై స్పందించిన మాజీ కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టారు.శనివారం సీసీ రోడ్డు పనులను ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమం లక్ష్మీనారాయణ కాలనీ అధ్యక్షుడు లూకాస్, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మురళి రెడ్డి, నాగరాజు, సుధాకర్, హరి, అశోక్ గౌడ్, నిరంజన్, నాగేశ్వరరావు, రవి వర్మ, దుర్గాప్రసాద్, రామారావు, వల్లూరి శీను, అచ్చిరెడ్డి, పెద్ద ప్రసాద్, చిన్న ప్రసాద్, మధుబాబు, పరమేష్, మీసాల రాములు, బ్రహ్మచారి, బిక్షపతి, నరసింహ చారి, శ్రీహరి చారి, పాండురంగాచారి, రాజు, కృష్ణ, మోహన్ బాబు, నాగేష్, ఇస్మాయిల్, ఖాదర్ వల్లి, మదర్, భాస్కర్ దాస్, వేణు, వెంకటేష్, సిహెచ్ కుమార్, నాగేశ్వరరావు, సి సి రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, సందీప్, భాస్కర్, మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఈసీ నగర్‌కు జలధార.. సీనియర్ సిటిజన్స్ సేవకు ప్రజల ప్రశంసలు

**నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం.. ఈసీ నగర్‌లో సీనియర్ సిటిజన్స్ సేవకు మరో మైలురాయి**





**చర్లపల్లి,జూన్27.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** చర్లపల్లి ఈసీ నగర్‌లో కాలనీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీనియర్ పౌరుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నూతన బోర్‌వెల్‌ను ప్రారంభించారు. కాలనీ ప్రజలకు తాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడేలా చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికుల ప్రశంసలు అందుకుంది.కాలనీ అభివృద్ధికి జీవితాంతం అంకితభావంతో సేవలందించిన కీర్తిశేషులు చింతలూరి వెంకట్రావు స్ఫూర్తితో, ఆయన కుమారుడు చింతలూరి నాగేశ్వరరావు స్వచ్ఛందంగా బోర్‌వెల్ ఏర్పాటు చేయించడం సామాజిక బాధ్యతకు నిదర్శనమని పలువురు కొనియాడారు. ప్రజా అవసరాలను గుర్తించి చేసిన ఈ సేవ కాలనీ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఈసీ నగర్ గృహనిర్మాణ సహకార సంఘం అధ్యక్షుడు బూడిద శ్రవణ్ కుమార్ గౌడ్, కార్యదర్శి జగ్గరాజు మాట్లాడుతూ, కాలనీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బోర్‌వెల్ ఏర్పాటు చేసిన చింతలూరి నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈసీ నగర్ సీనియర్ పౌరుల సంఘం అధ్యక్షుడు గోవర్ధన్, కార్యదర్శి గోపాలకృష్ణ, ఈసీ నగర్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ఏ. కృష్ణారెడ్డి, కార్యదర్శి మొగిలి మల్లేష్, నవనీత నాగరత్నం, బాల్‌రెడ్డి, భిక్షపతి, విష్ణు, డి. యాదయ్య, సీనియర్ నాయకులు యాదయ్యతో పాటు కాలనీ ప్రముఖులు, నివాసితులు పాల్గొన్నారు.

# నల్గొండ కుటుంబసభ్యుల హత్య కేసులో వీడిన మిష్టరీ

**హత్య చేసింది ఒక్కరే అని గుర్తింపు**

**నల్గొండలో నలుగురు కుటుంబసభ్యుల హత్య కేసు ఛేదించిన పోలీసులు**

**హత్య చేసింది ఒక్కడే అని సమాచారం**

**యూట్యూబ్ వీడియోలు చూసి హత్యకు పథకం వేసిన నిందితుడు అస్లాం**



నల్గొండలో నలుగురు కుటుంబసభ్యుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. నలుగురిని హత్య చేసింది ఒక్కడే అని గుర్తించారు. హత్యలో హసీనా అక్క కుమార్తె, ఆమె భర్త పాత్ర ఉన్నట్లు తెలిసింది. భార్యభర్తలు మహ్మద్ సుల్తాన్ (45), హసీనా (38), కుమారుడు ముజామిల్(20), కుమార్తె అఫోర(14) హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. బంగారం, ఆర్థిక లావాదేవీల వివాదంతోనే హత్య జరిగినట్లు పోలీసులు గుర్తించారు. కేసుకు సంబంధించిన వివరాలను మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీలో దంపతులు సుల్తాన్(45), హసీనా(38) నివసిస్తున్నారు. వీరికి ముజామిల్(20) అఫోర(14) ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుల్తాన్ ప్రకాశం బజార్‌లో బ్యాగులు అమ్మే వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అతని భార్య హసీనా ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. కుమార్తె అఫోర అదే పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. కుమారుడు ముజమిల్ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. అయితే సుల్తాన్ మొదటి భార్య గతంలోనే మృతి చెందింది. దీంతో ఆయన హసీనాను రెండో వివాహం చేసుకున్నారు. ఇప్పుడున్న ఇద్దరు మొదటి భార్య పిల్లలు.జూన్ 19వ తేదీన సుల్తాన్ తన వ్యాపారం ముగించుకుని రాత్రి ఇంటికి చేరుకున్నాడు. ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న హసీనా తన కుమార్తె అఫోరాతో కలిసి పాఠశాలకు వచ్చి అదే రోజు వెళ్లిందని స్కూల్ నిర్వాహకులు తెలిపారు. ముజామిల్ రాత్రి 10 గంటల వరకు షాప్‌లో పనిచేసి ఇంటికి చేరుకున్నాడు.అయితే ఆ అర్ధరాత్రి ఇంటి నుంచి పెద్దఎత్తున బచావ్, బచావ్ అనే హాహాకారాలు వినిపించాయని స్థానికులు చెప్పారు. ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు ఆయుధాలతో నలుగురిపై విచక్షణారహితంగా దాడి చేసిన గాయాలున్నాయని వైద్యులు తెలిపారు. నలుగురిని హత్య చేసిన తర్వాత వారిపై చద్దర్లను కప్పారు. ఇంట్లోకి ఎవరూ రాకుండా గేట్‌కు లాక్ వేశారు. మృతదేహాలను గుర్తించిన తర్వాత పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నలుగురిని చంపింది హసీనా అక్క కుమార్తె భర్త అస్లాం అని పోలీసులు నిర్ధరించారు. ఈనెల 20న తెల్లవారుజామున నలుగురిని హత్య చేసినట్లు పోలీసులు నిర్ధరించారు. తెల్లవారు జామున ఇంటి నుంచి బయటకు వచ్చిన హసీనాను అస్లాం హత్య చేశాడు. అరుపులు విని బయటకు వచ్చిన సుల్తాన్, కుమారుడు ముజామిల్‌నూ అస్లాం చంపాడు. నిందితుడు ఒకరి తర్వాత ఒకరిని కత్తితో పొడిచి చంపినట్లు పోలీసులు తెలిపారు. చివరికి ఇంట్లోకి వెళ్లి మంచం కింద దాక్కున్న అఫోరాను హత్య చేశాడు.నలుగురిని చంపి నిందితుడు ఇంట్లోని నగదు, ఆభరణాలు దోచుకెళ్లాడు. బంగారం, ఆర్థిక లావాదేవీల వల్లే హసీనా కుటుంబాన్ని అస్లాం చంపినట్లు తేలింది. అస్లాం యూట్యూబ్‌లో వీడియోలు చూసి హత్యకు పథకం వేసినట్లు తెలిసింది. ఈ కేసుతో పరోక్షంగా సంబంధమున్న మరో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.హసీనా తన అక్క కుమార్తె తబస్సుమ్‌కు ఏడాది క్రితం రూ.లక్ష అప్పుగా ఇచ్చింది. అస్లాం ఇటీవల మరో రూ.లక్ష కావాలని సుల్తాన్, హసీనా దంపతులను అడిగాడు. గతంలో ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని అక్క కుమార్తె, అల్లుడు అస్లాంను హసీనా అడిగింది. డబ్బుల కోసం ఒత్తిడి చేశారని పగ పెంచుకున్న తబస్సుమ్, అస్లాం దంపతులు హసీనా వద్ద ఉన్న డబ్బు, నగలును కూడా దోచుకోవాలని భావించారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 19న హైదరాబాద్ నుంచి నల్గొండకు వెళ్లి నలుగురిని అస్లాం హత్య చేశాడు.

# వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ఎఫెక్ట్

**రాష్ట్రంలో తగ్గిన సాగు విస్తీర్ణం , రాష్ట్రంలో 14.78 లక్షల ఎకరాల్లో సాగు**

**11.2% విస్తీర్ణంలోనే మొదలు, 0.48 శాతానికి పరిమితమైన వరినాట్లు**

**17 జిల్లాల్లో లోటు వర్షపాతమే కారణం , ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక**



ఎల్‌నినో పరిస్థితులు రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 1.32 కోట్ల ఎకరాల సాగుకు అనువైన భూమి ఉండగా, ఇప్పటివరకు రైతులు కేవలం 14.78 లక్షల ఎకరాల్లోనే పంటలు వేశారని వ్యవసాయ శాఖ ప్రకటించింది. దీనికి భిన్నంగా గత ఏడాది ఇదే సమయానికి 28.38 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వర్షపాతం లోపం కారణంగా ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం సుమారు 13.60 లక్షల ఎకరాలు తక్కువగా ఉందని ప్రభుత్వ నివేదిక పేర్కొంది.నైరుతి రుతుపవనాల కదలిక సరిగ్గా లేకపోవడం వల్ల వర్షపాత లోపం ఏర్పడింది. ఎల్ నినో ప్రభావం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం తగ్గింది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం ఈ సీజన్‌లో వరి సాగు లక్ష్యం 62.47 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 30,243 ఎకరాల్లోనే నాట్లు పూర్తయ్యాయి. ఇతర పంటల వివరాలు ఇలా ఉన్నాయి. పత్తి 48.93 లక్షల ఎకరాలకు ఇప్పటివరకు 12.60 లక్షల ఎకరాలు సాగు చేయగా, మొక్కజొన్న 5.21 లక్షల ఎకరాలకు 30,932 ఎకరాలు సాగు చేశారు. కందులు 6.69 లక్షల ఎకరాలకు 55,500ల ఎకరాలు, సోయాబీన్ 4.20 లక్షల ఎకరాలకు 24 వేల 666 ఎకరాలలో సాగు చేశారు. జొన్నలు 3,992 ఎకరాలు సాగు చేశారు. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో వర్షపాత లోపం కనిపించగా 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా రంగారెడ్డి, నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. రుతుపవనాల సీజన్ ప్రస్తుత పరిస్థితికి సంబంధించి వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.ఈ సీజన్‌లో ఇప్పటివరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 101.3 మి.మీ కాగా 84.6 మి.మీ వర్షపాతం నమోదైంది. దీనివల్ల 16.5 శాతం లోటు ఏర్పడింది. సిద్దిపేట, హన్మకొండ జిల్లాలు గణనీయమైన వర్షపాత లోటును ఎదుర్కొంటుండగా, ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, మెదక్, వరంగల్, మహబూబాబాద్, జనగాం, మేడ్చల్, జోగులాంబ గద్వాల్, యాదాద్రి వంటి జిల్లాలు పాక్షిక వర్షపాత లోటును ఎదుర్కొంటున్నాయి.ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఐఎమ్‌డీ ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది.

# మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

**మంత్రి లోకేశ్**

**ఆర్‌టీజీఎస్‌పై మంత్రి లోకేశ్ సమీక్ష**

**కుల, ఆదాయ ధ్రువపత్రాల మంజూరులో అడ్డంకులు తొలగించాలని సూచన**

**రేషన్ కార్డుల విభజనను మరింత సులభతరం చేయాలని ఆదేశం**




అరచేతిలోనే ప్రభుత్వ సేవలందించేలా రూపొందించిన మనమిత్ర - వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజలకు మరింత చేరువ చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. వినియోగాన్ని విస్తృతం చేయాలని సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో అడ్డంకులు తొలగించాలని స్పష్టం చేశారు. రేషన్‌కార్డుల విభజనను మరింత సులభతరం చేయాలన్నారు. అభ్యర్థి ఆధార్ నంబర్‌తో సర్టిఫికెట్లన్నీ డిజీ వెరిఫై చేసేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు.సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆర్టీజీఎస్‌పై లోకేశ్ సమీక్ష నిర్వహించారు. ఆర్టీజీఎస్ లక్ష్యాలు, ప్రాజెక్టుల పురోగతిపై ఆ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగం దాని వల్ల ప్రయోజనాలు సుల్నవుగా ప్రభుత్వ సేవలు ఎలా పొందవచ్చో ప్రజలకు వివరించాలని లోకేశ్ సూచించారు. ప్రభుత్వ శాఖల సమాచారాన్ని క్రోడీకరించేందుకు చేపట్టిన డేటాలేక్ పనులన్నీ జులై నాటికి పూర్తికావాలని ఆదేశించారు.సంజీవని కార్యక్రమాన్నీ డేటా లేక్‌తో అనుసంధానించాలని సూచించారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్లను డేటా లేక్ ద్వారా విశ్లేషించి, తగ్గించడానికి గల మార్గాలను అన్వేషించాలని దిశానిర్దేశం చేశారు. విద్యారంగంలో సమగ్ర సమాచారాన్ని ట్రాక్ చేస్తున్నామన్న లోకేశ్ అన్ని శాఖల సమాచారం డేటా లేక్ ద్వారా అనుసంధానం కావాలని సూచించారు.విద్యార్థులు, క్రీడాకారులకు విద్యా, క్రీడా సంస్థలు ఇచ్చే సర్టిఫికెట్లు, స్పోర్ట్స్ సర్టిఫికెట్లనూ అభ్యర్థి ఆధార్ సంఖ్య ఆధారంగా పారదర్శకంగా పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని లోకేశ్ సూచించారు. ఆధార్ నంబర్ నమోదు ద్వారా విద్యార్థి లేదా అభ్యర్థికి సర్టిఫికెట్లు ఏ సంస్థ, ఎప్పుడు, ఎవరు జారీ చేశారనే వివరాలు కూడా రియల్ టైమ్‌లో తెలిసేలా డీజీ వెరిఫైని పకడ్బందీగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.దీని వల్ల 99 శాతం అధికారుల పని కూడా సులభతరమవుతుందని వివరించారు. రాబోయే రోజుల్లో ఇచ్చే వేలాది పోస్టుల నోటిఫికేషన్లకు, లక్షల సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటారని లోకేశ్ తెలిపారు. వీరందరి సర్టిఫికెట్లు పొందుపరచడంలో ఇబ్బందులు లేకుండా డీజీ వెరిఫైని సమర్థంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావంపైనా మంత్రి లోకేశ్ సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను జలవనరులశాఖ, వ్యవసాయశాఖ, ఇతర శాఖలన్నీ సమన్వయంతో ప్రణాళికబద్ధంగా పనిచేసి సమర్థంగా ఎదుర్కొందామన్నారు. నీటి వృథాను అరికట్టి, తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించే దిశగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. రాయలసీమలో నీటి ఎద్దడి లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. యూరియా సరఫరాపైనా మంత్రి ఆరా తీశారు.వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా జల విద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో ఎదురయ్యే సమస్యలు అధిగమించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. జలాశయాల్లో నీటి మట్టాలు, పెరుగుతున్న విద్యుత్తు వినియోగం, భూగర్భ జలాలు వీటన్నింటినీ క్రోడీకరించాలన్నారు. వీటిని ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం విశ్లేషించి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఎక్కడా ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# కడప శివారులో పాలెంపల్లె వద్ద ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

**ముగ్గురు మృతి , నిన్నరాత్రి కడపలోని పాలెంపల్లె వద్ద రోడ్డుప్రమాదం**

**ఎదురెదురుగా ఢీకొన్న రెండు కార్లు**

**ముగ్గురు మృతి ప్రమాదంలో పలువురికి గాయాలు, రిమ్స్ ఆస్పత్రికి తరలింపు**



కడప జిల్లాలో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జిల్లాలోని పాలెంపల్లె వద్ద ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.తిరుపతి పట్టణం జీవకోనకు చెందిన హర్షవర్ధన్, కిషోర్‌తో పాటు మరో ఒకరు శుక్రవారం రాత్రి కడప శివారులోని అలంకానిపల్లె కూడలి నుంచి రింగురోడ్డుపై తిరుపతికి బయలుదేరారు. హైదరాబాదు అల్వార్ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తిరుపతి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. వారి రెండు కార్లు పాలంపల్లె వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హైదరాబాదుకు చెందిన వారి కారులోని బెలూన్స్ తెలుసుకోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. కానీ తిరుపతికి వెళుతున్న వారి బెలూన్స్ తెరుచుకోకపోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందారు. మృతి చెందిన వారిలో హర్షవర్ధన్, కిషోర్‌తో పాటు మరొకరు ఉన్నారు. యాక్సిడెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మూడు ప్రధాన అంశాలే కీలకంగా తుంగభద్ర కమిటీ అధ్యయనం!

**పూడిక తీత, నవలి రిజర్వాయర్ నిర్మాణం, ఆర్డీఎస్ నుంచి నీటి మళ్లింపుపైనా దృష్టి**

**కేంద్ర జలశక్తి శాఖ నుంచి బోర్డుకు వర్తమానం**




తుంగభద్రలో పూడికతీత, నవలి రిజర్వాయర్ నిర్మాణం, ఆర్డీఎస్ నుంచి నీటి మళ్లింపు! తుంగభద్ర జల వివాదాల పరిష్కారానికి కేంద్రం నియమించే కమిటీ ఈ మూడు అంశాలే కీలకంగా అధ్యయనం చేయనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో కొత్తగా నిర్మించే నవలి ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే అభ్యంతరం వ్యక్తం చేసిన తరుణంలో కమిటీ చూపే పరిష్కారం కీలకం కానుంది.తుంగభద్ర జల వివాదాల పరిష్కారానికి కేంద్రం నియమించే కమిటీ ప్రధానంగా 3 అంశాలపై దృష్టి సారించినట్లు సమాచారం. తుంగభద్రలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన పూడిక తొలగింపు, నవలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం, రాజోలి బండ మళ్లింపు పథకం- ఆర్డీఎస్‌లో తెలంగాణకు 15.9 టీఎంసీల మళ్లింపుపై కమిటీ అధ్యయనం చేయనున్నట్లు తెలిసింది.గురువారం తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలో వివిధ అంశాలు చర్చించారు. సమావేశం ముగిశాక ఈ 3 అంశాలపై పూర్తి సమాచారం పంపాలని కేంద్ర జలశక్తిశాఖలోని కీలక అధికారి తుంగభద్ర బోర్డు ముఖ్యుడిని ఆదేశించారు.1989లో తుంగభద్రలో పూడిక తొలగింపుపై సాధ్యాసాధ్యాల నివేదిక రూపొందించారు. ఒక టీఎంసీ నీటి నిల్వ పెంచేలా పూడిక తీయాలంటే వంద కోట్లు అవుతుందని లెక్కగట్టారు. 2007, 2012, 2023 బోర్డు సమావేశాల్లోనూ పూడికతీతపై చర్చలు జరిగాయి. పలు ప్రతిపాదనలు ముందుకొచ్చినా ఏదీ కార్యరూపం దాల్చలేదు. తుంగభద్రలో నీటి నిల్వ మట్టాలు 15 వందల 40 అడుగులకు 16 వందల 33 అడుగులకు మధ్య 755 మిలియన్ క్యూబిక్ మీటర్ల పూడిక వల్ల దాదాపు 26.7 టీఎంసీల నిల్వ తగ్గిపోతోంది.ఈ పూడిక తొలగింపు, రవాణా ఇతరత్రా ఖర్చులు కలిపి 24 వేల 600 కోట్లు అవుతుందని లెక్కించారు. అంటే ఒక టీఎంసీ నీటి నిల్వ పెంచాలంటే రూ. 920 కోట్లు ఖర్చవుతుంది. ఆ పూడిక మట్టి వేసేందుకు వేల ఎకరాలు కావాలి. ఈ పరిస్థితుల్లో కేంద్ర కమిటీ ఈ సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.ఏపీ అభ్యంతరం: తుంగభద్రలో పూడిక కారణంగా ఏర్పడిన నీటి నిల్వ నష్టాన్ని భర్తీ చేసేందుకు కర్ణాటక నవలి బ్యాలెన్సింగ్ జలాశయం నిర్మాణానికి సిద్ధమైంది. కొప్పల్ జిల్లాలోని నవలి గ్రామంలో తుంగభద్ర జలాశయం ఎడమ వైపు నుంచి ప్రారంభమయ్యేలా 30.90 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించాలని యోచిస్తోంది. ఈ కొత్త రిజర్వాయర్‌పై ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే అభ్యంతరాలు తెలిపింది. ఇప్పటికే కుడి గట్టు ఎగువ, దిగువ కాలువల్లోనూ, కేసీ కాలువ కేటాయింపులకు తగ్గట్లుగా నీళ్లు రావడం లేదన్నది ఏపీ అభ్యంతరం.నవలి రిజర్వాయర్ నిర్మిస్తే దిగువన ఉన్న ఏపీ కేటాయింపులు సరిగా వినియోగించుకోలేమని ఆందోళన వ్యక్తం చేస్తోంది. తుంగభద్ర డ్యాం నుంచి తమకు కేటాయించిన నీటిని వాడుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు అనుమతిస్తే తప్ప నవలికి అంగీకారం చెప్పలేమని ఏపీ ఇప్పటికే స్పష్టం చేసింది. దీనిపై కేంద్ర కమిటీ చూపే పరిష్కారం కీలకం కానుంది.

# ఏపీలో 11 వేల మందికి ఓపీఎస్

**సీఎం చిత్రపటానికి పాలాభిషేకం**

**ఏపీలో 11,000 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరణ**

**2004 తర్వాత చేరిన 2002-03 డీఎస్సీ అభ్యర్థులకు లబ్ధి**

**ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు**

**సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు**

**పీఎస్‌యూ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు**



ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 11 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా 2002-03 డీఎస్సీ ద్వారా ఎంపికై, 2004 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఉద్యోగ సంఘాలు సుదీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్‌కు ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదముద్ర వేసింది.ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడ గాంధీనగర్‌లో శుక్రవారం నిర్వహించిన కృతజ్ఞతా సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా, ఈ మార్పు కోసం కృషి చేసిన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఛైర్మన్ ఎ. విద్యాసాగర్‌తో పాటు ఇతర ప్రతినిధులను ఘనంగా సన్మానించారు.ఈ నిర్ణయం ఉద్యోగులకు గొప్ప ఊరటనిచ్చిందని, పెన్షన్ భద్రత అనేది ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని విద్యాసాగర్ పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని కొనియాడారు. గతంలో చంద్రబాబు హయాంలోనే సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, డెత్-కమ్-రిటైర్మెంట్ గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు కల్పించారని ఈ సందర్భంగా నేతలు గుర్తుచేశారు.2004 సెప్టెంబరుకు ముందు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికైన అర్హులైన ఉద్యోగులకు ఓపీఎస్ ప్రయోజనాలు కల్పించాలని ఈ వారం మొదట్లో జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. దీనితో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), సొసైటీలు, రెసిడెన్షియల్ సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.

# రూ. 200 కోట్లతో భద్రాచలం ఆలయం అభివృద్ధి పనుల ప్రారంభం

**భూమిపూజ నిర్వహించిన ఎమ్మెల్యే వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్**

**ఆలయ రూపురేఖలు మార్చేలా తొలి విడత అభివృద్ధి పనులు**

**వచ్చే ఏడాది శ్రీరామ నవమి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యం**

ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన భద్రాద్రి ఆలయ మాస్టర్ ప్లాన్ కల సాకారమయ్యే దిశగా అడుగులు పడ్డాయి. భద్రాద్రి క్షేత్ర అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్ ఆలయ పరిసరాల్లో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి ఈ మెగా ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. భద్రాచలం రామాలయ రూపురేఖలను మార్చేలా మొత్తం రూ. 200.89 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ తొలి విడత అభివృద్ధి పనులను చేపట్టారు. ఆలయానికి తూర్పు, దక్షిణం, ఉత్తరం వైపు ఉన్న పాత నిర్మాణాల తొలగింపు పనులు ఈరోజు ప్రారంభమయ్యాయి.ఆలయ పరిసరాల క్లియరెన్స్ పూర్తయిన తర్వాత... ప్రభుత్వం సిద్ధం చేసిన కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం పూర్తి శాస్త్రోక్తంగా, ఆగమ శాస్త్ర నియమాలను పాటిస్తూ అభివృద్ధి పనులు చేపడతారు. వచ్చే సంవత్సరం శ్రీరామ నవమి పండుగ నాటికి ఈ ఆలయ నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# తక్కువ వడ్డీ అనగానే బ్యాంకు మారుతున్నారా

**"హోం లోన్" విషయంలో ఈ పొరపాట్లు చేయొద్దు!**

**"హోం లోన్" బ్యాంకు మారుతున్నారా**

**ఈ విషయాలు తప్పక తెలుసుకోండి!**




ప్రస్తుత రోజుల్లో చాలా మంది బ్యాంక్ నుంచి హోం లోన్ తీసుకుని సొంతింటి కలను నెరవేర్చుకుంటుంటారు. అయితే, గృహ రుణం అనేది పెద్ద మొత్తంలో తీసుకోవడం వల్ల అది తీర్చేందుకు దీర్ఘకాలం ఈఎంఐ కట్టాల్సి ఉంటుంది. అందుకే, ఏ బ్యాంకు నుంచి హోం లోన్ తీసుకోవడం మంచిదో ముందుగానే తెలుసుకోవడం ఉత్తమం. ఇదిలా ఉంటే కొన్నేళ్లుగా హోమ్ లోన్ చెల్లిస్తున్న వారికి మరో బ్యాంకులో తక్కువ వడ్డీ రేటు అనగానే అందులోనికి మార్చుకోవాలనిపిస్తుంది. అయితే, గృహరుణం ఒక బ్యాంక్ నుంచి మరో బ్యాంక్‌కు బదిలీ చేసుకోవడం వల్ల నిజంగా డబ్బు ఆదా అవుతుందా లేదా అనే సందేహాలు వస్తుంటాయి. మరి, ఇందులో వాస్తమెంత హోం లోన్ కోసం మంచి బ్యాంక్‌ను ఎలా ఎంచుకోవాలో ఇప్పుడు చూద్దాం.గృహ రుణం తక్కువ వడ్డీ రేటు అనగానే ఒక బ్యాంక్ నుంచి మరో బ్యాంక్‌కు మార్చుకోవడం మీకు లాభంలా కనిపిస్తుంది. తక్కువ తగ్గే వడ్డీ భారం, మెరుగైన లోన్ రూల్స్ మిమ్మల్ని ఆకర్షిస్తాయి. ముఖ్యంగా లోన్ తీర్చేందుకు చాలా ఏళ్ల వ్యవధి ఉన్నప్పుడు బ్యాంక్ మారడం మంచి వెసులుబాటుగా అనిపిస్తుంది. అయితే, కేవలం ప్రకటనల్లో కనిపించే వడ్డీ రేట్లను మాత్రమే చూసి, హోం లోన్ మార్చుకునే నిర్ణయం తీసుకోవద్దంటున్నారు నిపుణులు. వడ్డీ రేటుతో పాటు మరికొన్ని అంశాలను పరిశీలించి ఆపై నిర్ణయం తీసుకోవాలంటున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం.లోన్ అధిక మొత్తంలో ఉన్నప్పుడు వడ్డీ రేటు కొద్దిగా తగ్గినా గణనీయమైన పొదుపు సాధ్యమవుతుంది. కానీ, తక్కువ వడ్డీ రేటును అందిస్తున్నంత మాత్రాన, అది మంచిదేమీ కాకపోవచ్చంటున్నారు నిపుణులు. ఎందుకంటే, కొత్తగా లోన్ అందించే ఆర్థిక సంస్థ ప్రాసెసింగ్ ఛార్జీలు, న్యాయ పరిశీలనా ఫీజులు, విలువ లెక్కింపు ఫీజుల పేరుతో అదనపు ఖర్చులను వసూలు చేయవచ్చు. పాత, కొత్త వడ్డీ రేట్ల మధ్య డిఫరెన్స్ లేనప్పుడు ఈ అదనపు ఛార్జీల వల్ల మీకు దక్కే బెనిఫిట్ కనుమరుగయ్యే ప్రమాదం ఉందంటున్నారు. అందుకే, వడ్డీ రేటు ఒక్కటే కాకుండా లోన్‌కు అయ్యే మొత్తం ఖర్చును పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యమని సూచిస్తున్నారు.హోమ్‌లోన్‌ను ప్రారంభంలోనే వేరే బ్యాంకుకు బదిలీ చేసుకోవడం వల్ల ఎక్కువ బెనిఫిట్ ఉంటుంది. ఎందుకంటే లోన్ తీసుకున్న మొదట్లో చెల్లించే ఈఎంఐలో ఎక్కువ భాగం వడ్డీకే జమ అవుతుంది. అందుకే, ఈ స్టేజ్‌లో వడ్డీ రేటును తగ్గించుకుంటే, ఎక్కువ మొత్తంలో డబ్బు ఆదా అవుతుందంటున్నారు నిపుణులు. అలాకాకుండా ఇప్పటికే చాలా సంవత్సరాలుగా ఈఎంఐలు కట్టి, అప్పు తీరిపోయే స్టేజ్‌కు చేరుకుంటే మాత్రం, వడ్డీలో చాలా భాగం ఇప్పటికే చెల్లించి ఉంటారు. కాబట్టి, అలాంటి టైమ్‌లో బ్యాంకు ఛేంజ్ అయినా మీకు కలిగే బెనిఫిట్ తక్కువగానే ఉంటుందంటున్నారు. అందుకే, బ్యాంకు మారాలనుకుంటున్నప్పుడు ముందు మిగిలిన లోన్ కాలపరిమితిలో నిజంగా ఎంత మొత్తం ఆదా అవుతుందో లెక్కించుకుని నిర్ణయం తీసుకోవాలంటున్నారు. గృహరుణం తీసుకున్నవారిలో వడ్డీ రేటు తక్కువ అనగానే చాలా మంది కేవలం తగ్గే ఈఎంఐని మాత్రమే చూస్తారు. కానీ, మరో బ్యాంకుకు మారడానికి అయ్యే అదనపు ఖర్చులను మర్చిపోతారు. రుణ బదిలీ ప్రక్రియలో కొత్తగా కాగితం పని, డాక్యుమెంట్ల పరిశీలన ఇలా చాలా ఖర్చులు కలిసి ఉంటాయి. చలన వడ్డీ రేటు ఉన్న ఇంటి రుణాలపై ముందస్తు చెల్లింపు ఫీజులుండవు. బదిలీ సంబంధిత ఖర్చులన్నీ చెల్లించాక కూడా, ఈ మార్పును సమర్థించుకునేంత స్థాయిలో తగినంత పొదుపు అవుతుందా లేదా చెక్ చేసుకుని నిర్ణయం తీసుకోవాలంటున్నారు.గృహ రుణ గ్రహీతల్లో చాలా మంది తక్కువ వడ్డీ రేట్లను చూపిస్తూ వచ్చే ప్రకటనలను చూసిన వెంటనే రుణ బదిలీకి ట్రై చేస్తుంటారు. ఏదైనా బ్యాంకు 7.5% లేదా 8శాతం వడ్డీ రేటును ప్రకటిస్తే, అప్పై చేసుకున్న ప్రతి ఒక్కరికీ అదే రేటు వర్తిస్తుందని అనుకోవడం పొరపాటు అంటున్నారు నిపుణులు. నిజానికి, మీకు లభించే వడ్డీ పూర్తిగా భిన్నంగా ఉండొచ్చని చెబుతున్నారు. కొత్త బ్యాంకు మీరు లోన్ తీసుకున్నప్పటి నుంచి మీ ఆర్థిక వ్యవహారాలను ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలిస్తుంది. సకాలంలో ఈఎంఐలు కట్టారా ఇతర రుణాలు ఏమైనా తీసుకున్నారా మీ ఇన్‌కమ్ పెరిగిందా లేదా ఆర్థిక పరిస్థితి మారిందా అనే అంశాలను పరిశీలనలోకి తీసుకుంటుంది. అప్పుడు చెల్లింపుల చరిత్ర బలంగా ఉండి, క్రెడిట్ స్కోరు 800లకు పైగా ఉన్నప్పుడే మీకు బేరమాడే శక్తి లభిస్తుందంటున్నారు. అలాకాకుండా గతం కంటే మీ ఆర్థిక పరిస్థితి తగ్గితే మాత్రం, మిమ్మల్ని ఆకర్షించిన వడ్డీ రేటు మీకు లభించకపోవచ్చంటున్నారు నిపుణులు.తక్కువ వడ్డీ రేటు చూసి బ్యాంక్ ఛేంజ్ అవ్వడం వల్ల మీ నెలవారీ ఈఎంఐ తగ్గుతున్నట్లు కనిపిస్తుంది. కానీ, దీని వెనుక ఒక ప్రతికూల అంశం దాగి ఉంది. అదేమిటంటే, ఈఎంఐ తగ్గడానికి కారణం మీ లోన్ చెల్లింపు కాలాన్ని పొడిగించడం కూడా అవ్వొచ్చు. దానివల్ల ప్రతి నెలా మీపై పడే ఆర్థిక భారం తగ్గినట్లు అనిపించినా, లోన్ తీర్చడానికి ఎక్కువ టైమ్ పడుతుందంటున్నారు. తద్వారా దీర్ఘకాలంలో ఎక్కువ వడ్డీని కట్టాల్సి వస్తుందని చెబుతున్నారు. కాబట్టి, కేవలం తగ్గిన ఈఎంఐని మాత్రమే పరిగణనలోకి తీసుకోకూడదంటున్నారు. ప్రస్తుతం నెలవారీ వాయిదాలు తగ్గడం మంచిగానే అనిపించినా, రాబోయే పది సంవత్సరాలలో మీరు అదనంగా చెల్లించే వడ్డీ భారం వల్ల బదిలీ ద్వారా దక్కిన ఆర్థిక ప్రయోజనం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ఛాన్స్ ఉంటుందని సూచిస్తున్నారు ఆర్థిక నిపుణులు.

# ఎఫ్‌డీలపై అధిక వడ్డీ ఇచ్చే "టాప్ 10 కంపెనీలు" ఇవే!

**ఏ సంస్థలో ఎంత ఉందంటే**

**ఎఫ్‌డీలపై బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ! , ఏ కంపెనీ ఎంత వడ్డీ చెల్లిస్తుందంటే**




ప్రస్తుత రోజుల్లో చాలా మంది తాము సంపాదించే ఆదాయంలో ఎంతో కొంత భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేస్తున్నారు. అందులో భాగంగానే ఎక్కువమంది బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తుంటారు. అయితే, వీటి మాదిరిగానే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. అంతేకాదు, ఈ కంపెనీల్లో బ్యాంకుల కంటే వడ్డీ రేట్లు ఎక్కువగానే ఉంటాయి. మరి, పెట్టుబడులపై అధిక రాబడినిచ్చే కంపెనీని ఎలా ఎంచుకోవాలి ప్రస్తుతం మంచి రేటింగ్ ఉన్న ప్రముఖ కంపెనీల్లో ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లు ఏవిధంగా ఉన్నాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం.పెట్టుబడిదారులు తమ పెట్టుబడులపై మంచి రాబడిని సంపాదించడానికి బ్యాంకులు, పోస్టాఫీసులతో పాటు చీదీఖీజ(నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ)లను ఎంచుకోవచ్చు. ఈ కంపెనీల్లో కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయొచ్చంటున్నారు నిపుణులు. అయితే, ఈ డిపాజిట్ల కాలవ్యవధి 1 నుంచి 5 సంవత్సరాలు ఉంటుంది. అలాగే, ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ఈ డిపాజిట్లపై వడ్డీ రేట్లు 1 నుంచి 1.50% అధికంగానే ఉన్నాయి. అంతేకాకుండా, కంపెనీలలో సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై కూడా 0.25 నుంచి 0.50% వరకు అదనపు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి.అయితే, ఈ నాన్ ఫైనాన్షియల్ బ్యాంకింగ్ సంస్థల్లో డిపాజిట్ చేసేటప్పుడు వాటి క్రెడిట్ రేటింగ్‌లను తప్పక చూడాలని చెబుతున్నారు నిపుణులు. వాటి రేటింగ్‌ను బట్టి ఎంచుకోవడం ద్వారా పెట్టుబడిపై రిస్క్ తగ్గుతుందని సూచిస్తున్నారు. ముఖ్యంగా 'ూూూ' రేటింగ్ ఉన్న కంపెనీల్లో డిపాజిట్ చేయడం మంచిదంటున్నారు. వీటిల్లో డిపాజిట్లకు గ్యారెంటీ ఎక్కువని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మంచి రేటింగ్ ఉన్న ప్రముఖ చీదీఖీజలు వివిధ కాలవ్యవధులకు తమ ఎఫ్‌డీలపై ఎంతెంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయో కింది పట్టికలో ఇప్పుడు చూద్దాం.బ్యాంకులో చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై కవరేజీ ఉంటుంది. అన్ని గవర్నమెంట్, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన రూ.5 లక్షల వరకు(వడ్డీతో కలిపి) డిపాజిట్లకు ఈ బీమా ఫెసిలిటీ ఉంటుంది.అయితే, కంపెనీ డిపాజిట్లకు బ్యాంకుల మాదిరిగాబీమా సౌకర్యం ఉండదని గమనించాలి.అదేవిధంగా, బ్యాంకు ఎఫ్‌డీ వడ్డీ ఆదాయంపై సెక్షన్ 80ుదీ కింద రూ.50 వేలు పన్ను మినహాయింపు పొందే ఛాన్స్ ఉంటుంది.ఎన్‌బీఎఫ్‌సీ డిపాజిట్లపై ఇలాంటి మినహాయింపులు ఉండవని గుర్తుంచుకోవాలి. పైగా బ్యాంకు డిపాజిట్లతో పోలిస్తే కంపెనీ డిపాజిట్లు ఎక్కువ రిస్క్ కలిగి ఉంటాయని గమనించాలి.కాబట్టి, ఎవరైనా సరే చీదీఖీజలలో పెట్టుబడి పెట్టే ముందు కంపెనీ క్రెడిట్ రేటింగ్, ఆర్థిక స్థిరత్వాన్ని చెక్ చేసి డిపాజిట్లు చేయడం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారా

**మెచ్యూరిటీ తర్వాత ఏం చేయాలి**

**విత్‌డ్రా చేస్తే మంచిదేనా!**

**పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశారా**

**గడువు ముగిసిన తర్వాత ఖాతా క్లోజ్ అవ్వదట**

**ఈ క్రమంలోనే పలు విషయాలు గమనించాలంటున్న నిపుణులు!**



భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండేందుకుప్రస్తుతం చాలా మంది కేంద్ర ప్రభుత్వ మద్దతు లభించే ప్రభుత్వ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. ముఖ్యంగా భరోసా, హామీతో కూడిన రాబడి అందించే పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో పెట్టుబడి పెడుతున్నారు. ప్రస్తుత రోజుల్లో ఈ పథకం ఎంతగానో ఆదరణ పొందింది. ఇక ఈ స్కీమ్ మెచ్యూరిటీ 15 సంవత్సరాలు. అయితే చాలా మంది గడువు ముగియగానే డబ్బును విత్‌డ్రా చేసుకుంటుంటారు. కానీ పీపీఎఫ్ మెచ్యూరిటీ పూర్తైన తర్వాత మరికొన్ని సంవత్సరాల పాటు ఖాతాను పొడిగిస్తే ఎక్స్‌ట్రా డబ్బులు వస్తాయంటున్నారు నిపుణులు. అది ఎలానో ఇప్పుడు చూద్దాం.ఆర్థిక లక్ష్యం కోసం దీర్ఘకాలిక పొదుపు పథకంగా పీపీఎఫ్‌ను చాలా మంది ఎంచుకుంటుంటారు. పన్ను మినహాయింపు, వచ్చిన వడ్డీ రాబడికీ ఎలాంటి పన్ను భారం లేకపోవడం ఇందులో కలిసొచ్చే అంశం. అయితే మరి స్కీమ్ మెచ్యూరిటీ పూర్తైన తర్వాత ఏఏ పనులు చేస్తే ఏం జరుగుతుందంటే.. 15 సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టినాక గడువు ముగిసినట్లయితే అకౌంట్‌ను క్లోజ్ చేసి పీపీఎఫ్ నిధిని విత్‌డ్రా చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. పదవీ విరమణ, పిల్లల చదువులు, ఇతర ఆర్థిక అవసరాలు ఉన్న వారికి ఈ మార్గం సరిపోతుంది.మెచ్యూరిటీ ముగిసిన తర్వాత డబ్బును ఉపసంహరించడం వంటివి చేయకుండా ఖాతాను 5 సంవత్సరాల చొప్పున పొడిగించుకోవచ్చంటున్నారు. ఇలా ఎన్ని సార్లైన పొడిగించి పెట్టుబడులూ కొనసాగించవచ్చని చెబుతున్నారు. దీనివల్ల చక్రవడ్డీ ప్రయోజనం మరింత పెరుగుతుందని అంటున్నారు.ఖాతా మెచ్యూరిటీ పూర్తైన తర్వాత మీ దగ్గర డబ్బులు లేకపోయినా స్కీమ్‌ను ఐదు సంవత్సరాల చొప్పున పొడిగించుకునే వీలుందని వివరిస్తున్నారు. అంటే ఎలాంటి కొత్త నిధులు జమ చేయకుండానే, ఖాతాను పెంచుకోవచ్చనమాట. ఈ విధానంలో పాత నిల్వపై ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రేటు లభిస్తూనే ఉంటుంది. ఆ వడ్డీపై ఎలాంటి పన్ను ఉండదంటున్నారు.పీపీఎఫ్ ఖాతాలో జమ చేసే మొత్తానికి ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ సెక్షన్ 80ఛ కింద పన్ను మినహాయింపు ఉంటుందని.. వడ్డీకీ పన్ను ఉండదని.. గడువు తీరాక వచ్చే మొత్తంపైనా పన్ను వర్తించదంటున్నాపు. ట్యాక్స్ మినహాయింపు ఉంటుంది కాబట్టే చాలామంది మదుపరులు ఖాతాను పొడిగించుకునేందుకే ఇష్టపడతారంటున్నారు. అలాగే కొత్త పెట్టుబడులతో ఖాతాను పొడిగించే వారికి పాక్షికంగా వెనక్కి తీసుకునే అవకాశమూ ఉంటుందంటున్నారు. అయిదేళ్ల వ్యవధి ప్రారంభానికి ముందు ఖాతాలో ఉన్న నిల్వలో గరిష్ఠంగా 60 శాతం వరకూ విత్‌డ్రా చేసుకోవచ్చని చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకసారి మాత్రమే ఈ పాక్షికంగా విత్‌డ్రా చేసేందుకు అనుమతి ఉంటుందని చెబుతున్నారు. అదే సమయంలో, మిగిలిన ఎక్కువ భాగం నిల్వ పెట్టుబడిగా కొనసాగుతుంది. అయితే మెచ్యూరిటీ ముగిసిన తర్వాత కొత్త పెట్టుబడులతో ఖాతాను కొనసాగించేందుకు ఫారం-4(ఫారం-హెచ్)ను సమర్పించాల్సి ఉంటుందంటున్నారు. ఖాతా గడువు ముగిసిన తేదీ నుంచి ఏడాదిలోపు ఈ పత్రాన్ని అందించాలని.. ఒకవేళ దీన్ని ఇవ్వకపోతే, అధికారికంగా ఖాతాను పొడిగించరంటున్నారు. దీని వల్ల పైన చెప్పిన ప్రయోజనాలు లభించవంటన్నారు.ఏం చేయాలి పీపీఎఫ్ పథకానికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ హామీ ఉంటుందని.. ఇందులో పెట్టిన డబ్బుకు ఎలాంటి ఇబ్బందీ లేదంటున్నారు. అయితే ఇన్వెస్టర్స్ రాబడులను ద్రవ్యోల్బణంతో బేరీజు వేసుకోవాలని చెబుతున్నారు. అయితే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, పీపీఎఫ్ ఇచ్చే స్థిరమైన వడ్డీ రేటు.. డబ్బు వాస్తవ కొనుగోలు శక్తిని పెద్దగా పెంచదంటున్నారు. అందుకే, పెట్టుబడిదారులు తమ మొత్తం పోర్ట్‌ఫోలియోను దృష్టిలో ఉంచుకోవాలని.. మూలధన భద్రత, స్థిరమైన పన్ను రహిత రాబడి లక్ష్యమైతే, పోర్ట్‌ఫోలియోలోని డెట్ విభాగంలో పీపీఎఫ్‌ను ఒక ప్రధాన భాగంగా చూడాలంటున్నారు. ఈక్విటీ ఆధారిత పెట్టుబడులతో పాటు, పీపీఎఫ్‌ను సమతుల్యం చేసుకుంటే, మంచి రాబడిని ఆర్జించేందుకు వీలుంటుందని సూచిస్తున్నారు. చివరగా పీపీఎఫ్‌పై ప్రభుత్వం ఎప్పటికప్పుడు వడ్డీ రేట్లను సమీక్షిస్తుంటుంది. కాబట్టి, వీటినీ గమనిస్తూ ఉండాలని చెబుతున్నారు. వ్యవధి తీరిన ఖాతా నుంచి డబ్బు ఉపసంహరించుకోవాలా వద్దా అనేది.. పెట్టుబడిదారులు తమ భవిష్యత్తు ఆర్థిక అవసరాల ఆధారంగా విశ్లేషించుకోవాలని సలహా ఇస్తున్నారు.

## మనవాళ్లు క్రెడిట్ కార్డులు విపరీతంగా వాడేస్తున్నారట!

**మే నెలలో రూ. 2,023 బిలియన్ లక్షల కోట్లకు చేరిన క్రెడిట్ కార్డు వ్యయం**

**దేశంలో 12 కోట్ల మైలురాయిని దాటిన మొత్తం క్రెడిట్ కార్డుల సంఖ్య**

**ఒక్క మే నెలలోనే సుమారు 10 లక్షల కొత్త కార్డుల జారీ**

**లావాదేవీల సంఖ్య పెరిగినా తగ్గుముఖం పట్టిన సగటు లావాదేవీ విలువ**



దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం మళ్లీ పుంజుకుంది. ఏప్రిల్ నెలలో స్వల్పంగా నెమ్మదించిన క్రెడిట్ కార్డు వ్యయాలు, మే నెలలో గణనీయంగా పెరిగాయి. 2026 మే నెలలో క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన మొత్తం వ్యయం రూ. 2,023 బిలియన్‌లకు చేరింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే ఇది 6.6 శాతం అధికం కాగా, ఏప్రిల్ నెలతో పోలిస్తే 2.6 శాతం వృద్ధి నమోదైంది.ఈ ఏడాది మే నెలలో దేశీయ క్రెడిట్ కార్డుల రంగం ఒక కీలక మైలురాయిని అధిగమించింది. సుమారు 10 లక్షల కొత్త కార్డులు జారీ కావడంతో, మొత్తం కార్డుల సంఖ్య 12.05 కోట్లకు చేరుకుంది. గత 15 నెలల్లో ఇదే అత్యధిక వార్షిక వృద్ధి (8.7 శాతం) కావడం గమనార్హం. లావాదేవీల సంఖ్య కూడా వార్షిక ప్రాతిపదికన 25.8 శాతం వృద్ధితో 587 మిలియన్లకు చేరుకుంది. మరోవైపు, ఒక్కో లావాదేవీపై సగటు వ్యయం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. చిన్న చిన్న మొత్తాల్లో కొనుగోళ్లకు కూడా క్రెడిట్ కార్డుల వాడకం పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రధాన బ్యాంకుల పనితీరులో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. కార్పొరేట్ వినియోగం బలంగా ఉండటంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) కార్డు సగటు వ్యయంలో 12 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 4.2 శాతం నెలవారీ వృద్ధిని సాధించింది. డిజిటల్ చెల్లింపులు, ఈ-కామర్స్ వ్యాప్తితో క్రెడిట్ కార్డుల మార్కెట్ విస్తరిస్తున్నప్పటికీ, పెరుగుతున్న వడ్డీ రేట్ల నేపథ్యంలో బ్యాంకులు రివార్డు పాయింట్ల విధానంలో తీసుకొస్తున్న మార్పుల ప్రభావం వ్యయాలపై కొంతమేర కనిపిస్తోంది.

## రియల్ ఎస్టేట్‌లో విచిత్ర పరిస్థితి.. తగ్గుతున్న చౌక ఇళ్లు, పెరుగుతున్న ఖరీదైన గృహాలు!

**దేశీయ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అందుబాటు ధరల గృహాల వాటా భారీగా పతనం**

**2019లో 45 శాతంగా ఉన్న వాటా, 2025 నాటికి 13-14 శాతానికి పడిపోయినట్లు అంచనా**

**పెరిగిన భూమి, నిర్మాణ వ్యయాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని నిపుణుల విశ్లేషణ**

**ప్రీమియం ఇళ్లకు డిమాండ్ పెరుగుతుండగా, చౌక గృహాల నిర్మాణం వెనుకబడింది**

**చిన్న పట్టణాల్లో గృహ రుణాల వృద్ధి మాత్రం బలంగానే ఉందని ఇక్రా వెల్లడి**



దేశంలో సామాన్యులకు అందుబాటులో ఉండే గృహాల (అఫర్డబుల్ హౌసింగ్) వాటా గత కొన్నేళ్లుగా గణనీయంగా పడిపోయింది. 2019లో దేశంలోని మొత్తం నివాస గృహాల అమ్మకాలలో దాదాపు 45 శాతం వాటా కలిగిన ఈ విభాగం, 2025 చివరి నాటికి కేవలం 13-14 శాతానికి పడిపోయిందని పరిశ్రమ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ మార్పు రియల్ ఎస్టేట్ రంగంలోని నిర్మాణాత్మక సవాళ్లను సూచిస్తోంది.రియల్ ఎస్టేట్ రంగంలో, ప్రీమియం ఇళ్ల అమ్మకాలు దూసుకెళుతుండగా, చౌక ఇళ్ల అమ్మకాలు వెనుకబడిపోయాయని అనరాక్ రీసెర్చ్ డేటా స్పష్టం చేస్తోంది. పెరుగుతున్న భూమి, నిర్మాణ వ్యయాలు, డెవలపర్లకు పరిమిత లాభాలు వంటివి ఈ పరిస్థితికి ప్రధాన కారణాలని అనరాక్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ ఠాకూర్ వివరించారు. అంతర్జాతీయ పరిణామాల వల్ల ముడిసరుకుల ధరలు పెరగడం, ప్రాజెక్టుల అనుమతులలో జాప్యం కూడా డెవలపర్లకు భారంగా మారిందని ఆయన తెలిపారు.ప్రస్తుతం అందుబాటు ధరల గృహాలకు ప్రభుత్వం నిర్దేశించిన రూ.45 లక్షల పరిమితి, ముఖ్యంగా మెట్రో నగరాల్లో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిమితిని పెంచితేనే ప్రాజెక్టులు లాభదాయకంగా మారి, సరఫరా పెరుగుతుందని సూచిస్తున్నారు.అయితే, డిమాండ్ పరంగా ఈ విభాగంలో గృహ రుణాల వృద్ధి మాత్రం బలంగానే ఉందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా (×జ=ూ) తెలిపింది. ముఖ్యంగా టైర్-2, టైర్-3 నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల ద్వారా రుణాలు బాగా పెరుగుతున్నాయని, ఈ వృద్ధి సుమారు 20 శాతం ఉంటుందని ఇక్రా అంచనా వేసింది. ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (ూవీహ్) వంటి పథకాలతో ఈ కొరతను తీర్చడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, ఆర్థిక కారణాల వల్ల ప్రైవేట్ డెవలపర్ల భాగస్వామ్యం పరిమితంగానే ఉంది. దీంతో దేశంలో లక్షలాది అందుబాటు ధరల గృహాల కొరత కొనసాగుతూనే ఉంది.

## ఫోక్స్‌వ్యాగన్‌లో భారీ కోతలు.. లక్ష మంది ఉద్యోగుల తొలగింపునకు ప్రణాళిక..

**వోక్స్‌వ్యాగన్‌లో భారీ పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధం**

**లక్ష వరకు ఉద్యోగాలను తొలగించే యోచనలో కంపెనీ**

**జర్మనీలో పలు కీలక ఫ్యాక్టరీల మూసివేతకు ప్రణాళికలు**



జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్, తన చరిత్రలోనే అతిపెద్ద పునర్వ్యవస్థీకరణ చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా దాదాపు లక్ష ఉద్యోగాలను తొలగించడంతో పాటు, జర్మనీలోని పలు ఫ్యాక్టరీలను మూసివేయాలని, పెట్టుబడులను గణనీయంగా తగ్గించాలని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) ఆలివర్ బ్లూమ్ యోచిస్తున్నట్లు సమాచారం.'మేనేజర్' మ్యాగజైన్ కథనం ప్రకారం, ఈ ప్రతిపాదనలకు కంపెనీ బోర్డు ఆమోదం లభించాల్సి ఉంది. రాబోయే ఐదేళ్లలో పెట్టుబడుల ప్రణాళికలో 15 శాతం కోత విధించి, మూలధన వ్యయాన్ని 130 బిలియన్ యూరోలకు తగ్గించాలని కంపెనీ భావిస్తోంది. అదే సమయంలో, ఫోక్స్‌వ్యాగన్ ప్యాసింజర్ కార్ల బ్రాండ్‌ను, దాని విడిభాగాల వ్యాపారాన్ని వేర్వేరు సంస్థలుగా విభజించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. కార్యకలాపాలను సులభతరం చేసి, సామర్థ్యాన్ని మెరుగుపరచడమే ఈ మార్పుల లక్ష్యం.అమెరికా టారిఫ్‌లు, చైనా ఎలక్ట్రిక్ వాహన తయారీదారుల నుంచి పెరుగుతున్న పోటీ, ఎలక్ట్రిక్ మొబిలిటీకి మారడంలో అవుతున్న అధిక వ్యయాలు వంటి సవాళ్లను ఎదుర్కోవడానికే ఈ మార్పులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. లాభదాయకతను పెంచుకోవాల్సిన అవసరం ఉందని సీఈఓ బ్లూమ్ గతంలో చాలాసార్లు స్పష్టం చేశారు. ఈ ప్రణాళికలు అమలైతే, ఫోక్స్‌వ్యాగన్‌కు చెందిన హానోవర్, జ్వికావు, ఎమ్డెన్ ప్లాంట్‌లతో పాటు ఆడికి చెందిన నెకార్సల్మ్ ఫ్యాక్టరీలో కూడా ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉంది.ఈ నివేదికలపై నేరుగా స్పందించడానికి ఫోక్స్‌వ్యాగన్ నిరాకరించింది. అయితే, పోటీలో నిలబడాలంటే గ్రూప్ మొత్తం దూరదృష్టితో కూడిన మార్పులకు లోనుకావాల్సి ఉందని అంగీకరించింది. మరోవైపు, ఫ్యాక్టరీల మూసివేతను, ఉద్యోగాల కోతను తీవ్రంగా వ్యతిరేకిస్తామని అక్కడి కార్మిక సంఘాలు, ఐజీ మెటల్ యూనియన్ హెచ్చరించాయి. దీంతో భవిష్యత్తులో కార్మిక వివాదాలు తలెత్తే అవకాశం కనిపిస్తోంది.



# 6 క్యారవాన్లు, 50 మంది అసిస్టెంట్లు..
# విజయ్ దేవరకొండ డిమాండ్ వార్తలపై స్పందించిన నిర్మాత

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆయన నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఇటీవల ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్‌గా మారాయి. 'రణబాలి' చిత్రీకరణ సమయంలో విజయ్ దేవరకొండ ఐదు కారవాన్లు ఏర్పాటు చేయాలని కోరారని, తన వెంట పెద్ద సంఖ్యలో అసిస్టెంట్లు ఉండాలని డిమాండ్ చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ వార్తలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి. ఈ ప్రచారంపై ఇప్పటికే విజయ్ దేవరకొండ బృందం స్పందించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. హీరోపై కావాలనే తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొంది. అసత్య కథనాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని విజయ్ టీమ్ హెచ్చరించింది. తాజాగా ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి కూడా స్పందించారు. షూటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, విజయ్ దేవరకొండ నుంచి అసాధారణమైన డిమాండ్లు ఏవీ రాలేదని ఆయన స్పష్టం చేశారు. విజయ్ ఎప్పుడూ పనిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తారని, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తారని నిర్మాత తెలిపారు. ఆయనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఇక 'రణబాలి' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ పాలన కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'రణబాలి' చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తయింది. మిగిలిన భాగాన్ని వేగంగా పూర్తి చేసి సినిమాను సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, కాన్సెప్ట్ విజువల్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రాల్లో ఒకటిగా 'రణబాలి' రూపొందుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.

## ఉత్కంఠను కలిగించేలా 'తత్వం' ట్రైలర్



కొత్త కథలు, వినూత్నమైన కథలకు తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ ఉంటుంది. సినిమా చూస్తున్నంత సేపు వాళ్లని ఎంగేజ్ చేయగలిగితే ఆ సినిమా చిన్నదైనా పెద్ద విజయాన్ని అందిస్తారు. ముఖ్యంగా మర్డర్ మిస్టరీ జానర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుంది. ఇప్పుడు ఇదే కోవలో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే అంశాలతో రాబోతున్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎడిటర్ విప్లవ్ నైషదం మాట్లాడుతూ '' ఈ సినిమా జర్నీ ఎంతో స్పెషల్.. ఈ సినిమా కోసం అందరూ ఎంతో కష్టపడ్డారు. అర్జున్ సాఫ్టవేర్‌రంగం నుంచి వచ్చి ఎంతో ఇష్టంతో ఈ సినిమాకు దర్శకత్వం చేశాడు. ఎంతో అనుభవం ఉన్న దర్శకుడిలా ఈ చిత్రాన్ని డీల్ చేశాడు,. ఆద్యంత ఎంతో ఉత్కంఠభరితంగా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు నాకు సంతోషంగా ఉంది' అన్నారు. సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ మాట్లాడుతూ '' ఈ రోజుల్లో చిన్న సినిమాల ద్వారా మంచి కంటెంట్‌ను ఇస్తున్నారు. ఆడియన్స్ కూడా ఆదరిస్తున్నారు. ఇది కూడా ఆ కోవలోకి వచ్చే చిత్రమే. ఈ సినిమా అందరికి తప్పకుండా నచ్చుతుంది. మంచి ఎమోషనల్ కనెక్టవిటి ఉన్న థ్రిల్లర్. సంగీతానికి స్కోప్ ఉన్న చిత్రమిది. అర్జున్ ఎంతో ప్రతిభ ఉన్న దర్శకుడు' అన్నారు. నిర్మాత వంశీ సీమకుర్తి మాట్లాడుతూ '' ట్రైలర్ అందరికి నచ్చింది. సినిమా కూడా చాలా బాగుంటుంది. దర్శకుడు అనుకున్నది అనుకున్నట్లుగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశాడు. ఈసినిమా మంచి అవుట్ పుట్ రావడానికి అందరూ సహకరించారు. అందరూ ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు అర్జున్ కోలా మాట్లాడుతూ '' ఈ మూవీ టైటిల్, కాన్సెప్ట్‌ను మన చుట్టు జరుగుతున్న ఇన్‌సిడెంట్స్ ఆధారంగా తయారుచేసుకున్నాను. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ ఇది. దినేష్ తేజ్ వినగానే వెంటనే ఓకే చేశాడు. ఈ సినిమా కోసం అందరూ దిబెస్ట్ ఇచ్చారు. కథ తప్పకుండా అందర్ని ఎంగేజింగ్‌గా ఉంటుంది. వంశీ గారి అన్వేషణ తరహాలోనే అందర్ని కట్టిపడేసే సినిమా ఇది. ఈ సినిమాలో ఉంటే ట్విస్ట్ ఆడియన్స్‌కు షాకింగ్‌గా ఉంటుంది।' అన్నారు. హీరో దినేష్ తేజ్ మాట్లాడుతూ ''నేను కలిసి పనిచేయాలనుకున్న టెక్నిషియన్స్‌తో ఈ సినిమాలో వర్క్ చేశాను. ఈసినిమాతో చాలా మంది కొత్తవాళ్లు పరిచయం అవుతున్నారు. అందరం చాలా కష్టపడ్డాం. అది సినిమా చూసిన తరువాత అందరికి తెలుస్తుంది. ఇక మీద నా సినిమాలకు గ్యాప్ రాదు.




# 4 నెలల్లో షూటింగ్ కంప్లీట్..
# 'వారణాసి'పై రాజమౌళి బిగ్ అప్‌డేట్!

మహేశ్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. ఈ చిత్ర షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని దర్శకుడు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ఒక అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని తాము ముందుగానే భావించామని, అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదని కేవలం సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశామని తెలిపారు. సాధారణంగా మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌కు అలవాటు పడ్డాయని, అందువల్ల అటు ఐమాక్స్, ఇటు సినిమా స్కోప్ రెండింటికీ సరిపోయేలా 'అనోమార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించినట్లు వివరించారు. దీనికోసం ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ తర్వాత పని చాలా సులభంగా సాగిపోయిందని జక్కన్న చెప్పుకొచ్చారు. ఇక గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.

# తెలంగాణలో జరిగిన వాస్తవ ఘటనలతో 'సర్కారు బాయి'




శ్రీరామ్ నిమ్మల, వర్షిక హీరో హీరోయన్స్ గా నటిస్తున్న సినిమా 'సర్కారు బాయి'. ఈ చిత్రాన్ని డెక్కన్ ఫిలింస్ సమర్పణలో ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు లారా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అప్పటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబిస్తూ నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటం వంటి అంశాలను దర్శకుడు లారా కళ్లకు కట్టినట్లు తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు హీరో శ్రీరామ్ నిమ్మల పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ మూవీ టీమ్ బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో తెలంగాణ పల్లె యువకుడిగా ఎంతో సహజంగా శ్రీరామ్ నిమ్మల కనిపిస్తున్నారు. ప్రస్తుతం "సర్కారు బాయి" సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ నెల 17వ తేదీ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. చేగుంట సమీపంలోని రెడ్డిపల్లి అనే ఊరిలో "సర్కారు బాయి" చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ లెంగ్తీ షెడ్యూల్ లో సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. హీరో శ్రీరామ్ నిమ్మల, హీరోయిన్ వర్షిక, ముఖ్య నటీనటులు బాహుబలి ప్రభాకర్, నాగ మహేష్ లపై సీన్స్ షూటింగ్ చేస్తున్నారు. జూలై నెలాఖరు వరకు ఈ భారీ షెడ్యూల్ కొనసాగనుంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో మేకర్స్ వెల్లడించనున్నారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com